మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థులు నల్లారి కిశోర్, షాజహాన్‌బాషా, జయచంద్రారెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రావు, చల్లా బాబు



అరాచక పాలనను అంతం చేయడమే లక్ష్యం

● మాజీ సీఎం, రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

కలికిరి, మార్చి 30: రాష్ట్రంలో నెలకొన్న అరాచక పాలనను, అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన ప్రస్తుత ప్రభుత్వాన్ని అంతం చేయడానికే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పోరాటం చేయడానికి సిద్ధంగా ఉందని మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు ఎన్డీఏ కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బీజేపీ నుంచి టికెట్ పొందిన అనంతరం ఆయన మొదటిసారిగా శనివారం కలికిరికి వచ్చారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంటు పరిధిలోని టీడీపీ, జనసేన శాసనసభ అభ్యర్థులతో కలిసి స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్లమెంటు పరిధిలోని శాసనసభ అభ్యర్థులతో కలిసి ఎన్నికలను ఎదుర్కోవడానికి ఉమ్మడి వ్యూహాన్ని రచించడం కోసం సమావేశమైనట్లు చెప్పారు. రాష్ట్రంలో అవినీతిమయమైన నియంతృత్వ పాలన గురించి ప్రజలందరికీ తెలిసిందేనని, రాబోయే రోజుల్లో వీటన్నింటినీ ప్రజల ముందుకు చర్చకు పెడతామని పేర్కొన్నారు. అడ్డగోలు పరిపాలనతో రాష్ట్ర ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్న ప్రభుత్వానికి ముగింపు పలకాలనే లక్ష్యంతోనే తాను పోటీ చేయాలని నిర్ణయించినట్లు కిరణ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రధాని మోదీ దేశం కోసం అవిశ్రాంతంగా కష్టపడి పనిచేస్తున్నారని కితాబిచ్చారు. పదేళ్ల పాలనలో ఇసుమంత అవినీతి ఆరోపణ కూడా లేకుండా పరిపాలించడం ఆషామాషీ వ్యవహారం కాదని చెప్పారు. దేశ, విదేశాల్లోని భారతీయులందరూ గర్వపడే విధంగా ప్రపంచంలో భారత కీర్తి ప్రతిష్టల్ని ఇనుమడింపజేయడానికి మోదీ చేపడుతున్న చర్యలు, పరిపాలనా విధానాలు ప్రజలు గుర్తించి సమర్థించాల్సిన సమయం వచ్చిందని వివరించారు. ఐదు ఇస్లామిక్ దేశాల నుంచి ఉమ్మడి ఉన్నతస్థాయి పురస్కారాన్ని అందుకోవడం మోదీ మతాతీత పరిపాలనకు దృష్టాంతంగా కిరణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం విభజనకు గురవుతున్న సమయంలో కూడా తల్లిని చంపి బిడ్డను బతికిస్తున్నారని మోదీ ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో అదుపు తప్పుతున్న పాలనను గాడిన పెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని మోదీ, అమిత్‌షా, నడ్డాలు నడుం బిగించారని, అందుకోసమే టీడీపీ, జనసేనలతో కలిసి బీజేపీ ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు కిరణ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. సమావేశంలో కిరణ్‌కుమార్ రెడ్డితో పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె, రాయచోటి, పుంగనూరు, రైల్వేకోడూరు స్థానాల నుంచి ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థులు నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, షాజహాన్ బాషా, జయచంద్రారెడ్డి, మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి, కోడూరు జనసేన అభ్యర్థి యనమల భాస్కర్‌రావు, రాజంపేట పార్లమెంటు బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ కూడా పాల్గొన్నారు.

ఏడేళ్ల ఎడబాటుకు తెర

● ఒక్కటైన అన్నా తమ్ముడు

● నల్లారి కిరణ్, కిశోర్ ఏకమయ్యారు

కలికిరి, మార్చి 30: నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి.. కిశోర్‌కుమార్ రెడ్డి ఏడేళ్ల క్రితం వరకూ అవిభాజ్య కవలల్లా ఉండేవారు. సంవత్సరం వేరైనా వీరిద్దరి పుట్టిన తేదీలు కూడా ఒక్కటే.. సెప్టెంబరు 13. అలాంటిది ఏడేళ్ల క్రితం రాజకీయంగా నల్లారి కుటుంబం ప్రాభవం కోల్పోతోందన్న బిడియంతో ఉన్న తమ అనుయాయులు చెదిరిపోకుండా ఉండటానికి కిశోర్‌కుమార్‌రెడ్డి 2017లో టీడీపీలో చేరారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించిన కిరణ్‌కుమార్ రెడ్డి తన తమ్ముడితో పూర్తి స్థాయిలో విభేదాలు ఈరోజు వరకూ కొనసాగించారు. మాజీ సీఎంగా కిరణ్‌కుమార్ రెడ్డి కలికిరికి వచ్చినా నగరిపల్లెలోని సొంత ఇంటికి వెళ్లకుండా ఈ ఏడేళ్లు స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మకాం వేయడం అలవాటు చేసుకున్నారు. సరిగ్గా ఏడాది క్రితం ఆయన కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఇక అన్నదమ్ములిద్దరూ కలిసే అవకాశం లేదేమోనన్న అనుయాయులు బెంగపడ్డ తరుణంలో కాగల కార్యం గంధర్వులు తీర్చినట్లు అటు బీజేపీ, టీడీపీ పొత్తు కుదరడం అనూహ్య రీతిలో రాజంపేట పార్లమెంటు సీటు కిరణ్‌కుమార్‌రెడ్డికి, పీలేరు టీడీపీ టికెట్టు కిశోర్‌కుమార్ రెడ్డికి ఖరారయ్యాయి. అయినా ఇద్దరూ ఎడమొహం పెడమొహంగానే వ్యవహరించడం అనుయాయుల్లో ఆందోళన నెలకొంది. శనివారం కలికిరి చేరుకున్న కిరణ్‌కుమార్‌రెడ్డి నగరిపల్లెలో కిశోర్‌కుమార్ రెడ్డి ఇంటికి రావడంతో ఏడేళ్ల ఎడబాటుకు తెరపడినట్లయింది. అనంతరం తమ్ముడితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిరణ్‌కుమార్‌రెడ్డి అనూహ్యంగా పెద్దిరెడ్డిపై నేరుగా విరుచుకుపడటంతో గత ఐదేళ్ల నుంచి పెద్దిరెడ్డి కుటుంబంతో ఒంటరి పోరు చేస్తున్న కిశోర్‌కుమార్ రెడ్డికి కొండంత భారం తగ్గినట్లయింది. మరోవైపు ఈ ఘట్టం కోసమే ఎదురుచూస్తున్నామన్నట్లు వేలాదిగా చేరిన నల్లారి అనుచరులంగా నూతనోత్సాహాన్ని సంతరించుకున్నారు. ఇప్పుడు తాజా రాజకీయాల్లో ఇదే పెద్ద చర్చనీయాంశమైంది.


జనం డిసైడయ్యారు..!

● చల్లని సాయంత్రం వేళ.. 'మేమంతా సిద్ధం' పేరిట జగన్ సభ ● మండుటెండలో.. ప్రజాగళం వినిపించిన చంద్రబాబు

● జగన్ సభలో జనం జంప్ ● చంద్రబాబు రోడ్‌షోలో ఎండను లెక్కచేయని జనం ● ప్రొద్దుటూరులో నాలుగురోజుల వ్యవధిలో రెండు సభల తీరు

జనం డిసైడై పోయారు.. వచ్చే ఎన్నికల్లో ఎవరిని గెలిపించాలో.. ఎవరిని ఇంటికి పంపాలో ఇప్పటికే నిర్ణయించేసుకున్నారు. మూడు రోజుల వ్యవధిలో ప్రొద్దుటూరులో వైసీపీ, టీడీపీ అధ్యక్షులు నిర్వహించిన కార్యక్రమానికి జనం స్పందన చూస్తే ఇది స్పష్టంగా తెలిసిపోతుంది. ఈ నెల 27వ తేదీన 'మేమంతా సిద్ధం' అంటూ సాయంత్రం చల్లనివేళలో జగన్ సభ జరిగింది. దీనికి హాజరైన జనం జగన్ ప్రసంగం మొదలు పెట్టగానే ఇంటిదారి పట్టారు. ఆయన ప్రసంగం పూర్తయ్యే సరికి సభ గ్యాలరీలన్నీ దాదాపు ఖాళీగా వెక్కిరించాయి. ఇక శనివారం ప్రజాగళం పేరిట చంద్రబాబు రోడ్ షో మిట్ట మధ్యాహ్నం మంచి ఎండలో నిర్వహించారు. అయినా జనం రెండుగంటలకు పైగా ఆయన కోసం ఎదురుచూసి.. గంటకు పైగా చంద్రబాబు ప్రసంగాన్ని శ్రద్ధగా విన్నారు. దీన్ని చూసి రాజకీయ విశ్లేషకులు 'జనం ఎవరిని గెలిపించాలో ఇప్పటికే డిసైడ్ అయిపోయారు' అని అంటున్నారు.


శనివారం మధ్యాహ్నం ప్రొద్దుటూరులో రోడ్‌షోకు హాజరైన జనం


మాట్లాడుతున్న చంద్రబాబు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సీఎం వైఎస్ జగన్ కుటుంబం సొంత గడ్డ. టీడీపీ ఆవిర్భావం నుంచి 1999 ఎన్నికల వరకు ఉమ్మడి జిల్లాలో సత్తా చాటింది. 2004లో వైఎస్ సీఎం అయిన తరువాత కాంగ్రెస్ అడ్డాగా మారింది. అందుకే జగన్ పార్టీ పెట్టిన తరువాత 2014లో 9స్థానాలు, 2019లో ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ వైసీపీ విజయం సాధించింది. జగన్ సీఎం అయిన తరువాత జిల్లా జనాల్లో మార్పు వస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులివెందుల నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన రామగోపాల్‌రెడ్డి గెలిచారు. అది వైసీపీకి పెద్ద మైనస్. పైదంతా పక్కన బెట్టిస్తే నాలుగురోజుల వ్యవధిలో జిల్లాలో అదీ ఒకే ఊరిలో ప్రొద్దుటూరులో నిర్వహించిన జగన్, చంద్రబాబు సభలను చూస్తే జనాభిప్రాయం వేరుగా ఉంది.

చల్లని సాయంత్రం.. జగన్ సభ అలా

రాష్ట్రవ్యాప్తంగా 21 రోజుల ఎన్నికల ప్రచారానికి సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సుయాత్రకు సిద్ధమయ్యారు. 27వ తేదీన ఇడుపులపాయలో తండ్రి వైఎస్‌కు నివాళులర్పించి బస్సుయాత్రకు శ్రీకారం చుట్టారు. ఇడుపులపాయకు ఉమ్మడి జిల్లా నుంచే కాదు.. పొరుగు జిల్లాల నుంచి భారీగా జనాలను తీసుకువచ్చారు. అయితే ఇడుపులపాయలోని జనం, వేంపల్లె బైపాస్‌కు వచ్చేసరికి అదృశ్యమయ్యారు. ప్రొద్దుటూరులో సభకు ఉమ్మడిజిల్లాతో పాటు పక్కనున్న నంద్యాల, అనంతపురం జిల్లాల నుంచి కూడా భారీగా జన సమీకరణ చేశారు. అది కూడా సభ సాయంత్రం పూటే. ఊరి బయట చల్లటి గాలులు వీచే ప్రాంతం. జగన్ ఫస్ట్‌మీటింగ్ కావడంతో కనీవినీ ఎరుగని రీతిలో ఈ సభ సక్సెస్ చేయాలని భావించారు. ప్రతి ఊరికి ఆర్టీసీ బస్సులను పంపించారు. ఇక మీటింగ్‌కు వచ్చే జనాలకు రూ.600, మందు, బిరియాని ఇచ్చారని ప్రచారం సాగింది. జగన్ సభ వద్దకు వచ్చేసరికి జనం కొందరు వెళ్లిపోయారు. జగన్ వచ్చి అభివాదం చేసిన తరువాత సగం మంది జంప్ అయ్యారు. ఇక ప్రసంగం మొదలైన తరువాత దాదాపు జనం అంతా జంప్ అయ్యారు. అప్పటికీ పోలీసులు అడ్డుపడినా కూడా ఆగలేదు. లక్షా 50వేల మందితో అన్న మీటింగ్ 30 వేల మంది కూడా రాలేదని ఆ పార్టీ వర్గాలే పేర్కొన్నాయి.

మండుటెండలో.. చంద్రబాబు రోడ్‌షో ఇలా

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజాగళం పేరిట ప్రొద్దుటూరులో శనివారం రోడ్ షో నిర్వహించారు. రెండుగంటలు ఆలస్యంగా 12.03కు రోడ్‌షో జరిగే ప్రాంతానికి వచ్చారు. శనివారం ఎండ తీవ్రంగా కాసింది. చంద్రబాబు ప్రసంగం మిట్టమధ్యాహ్నం కరెక్టుగా 12.15కు మొదలైంది. దాదాపు గంట 20 నిమిషాలు మాట్లాడారు. వాతావరణశాఖ ప్రకారం ప్రొద్దుటూరులో ఎండలే కాదు వడగాల్పులు కూడా ఉన్నాయి. చంద్రబాబు రాకముందు నుంచి అంటే దాదాపు మూడున్నర గంటల పాటు కొందరు జనం పుట్టపర్తి సర్కిల్‌లో ఉన్నారు. మండుటెండను తట్టుకుని చంద్రబాబు ప్రసంగాన్ని ఆసాంతం ఆలకించారు. సభకు వచ్చిన వారిలో చివరి వరకు దాదాపు 70శాతం మంది ఉన్నారు. మరి కొందరు నిప్పులు కక్కే ఎండను తట్టుకోలేక పక్కనున్న నీడలోకి చేరుకున్నారు. ఎండలు లెక్క చేయకుండా ఉన్న జనసందోహాన్ని చూసి చంద్రబాబు కూడా జోష్‌గా మాట్లాడారు. సీఎం జగన్ కడప జిల్లాకు ఏం చేశారు. స్టీలు ఫ్యాక్టరీకి రెండుసార్లు శంకుస్థాపనలు చేశారు. అదే నేనే సీఎం అయి ఉండింటే ఈసరికి స్టీలు ఫ్యాక్టరీ ప్రారంభం అయి ఉండేది అన్నారు. కియో మోటరును నేనే శంకుస్థాపన చేశా, నేనే ప్రారంభించా. అదీ మన బ్రాండ్.. అంటూ చంద్రబాబు చెప్పడంతో జనాల్లో మంచి స్పందన వచ్చింది. వైసీపీ తొలి ఎన్నికల సభలో జగన్ మాత్రం స్టీలు ఫ్యాక్టరీ ఊసే ఎత్తలేదు. జగన్, చంద్రబాబు సభలు చూస్తే.. జగన్ సొంత గడ్డలో అదీ మిట్టమధ్యాహ్నం వేళ చంద్రబాబుకు జనం నీరాజనాలు పట్టడం వైసీపీలో ఆందోళన పెంచగా.. టీడీపీలో ఊపు తెచ్చింది.


ప్రొద్దుటూరులోని హెలీప్యాడ్ వద్ద చంద్రబాబునాయుడును సన్మానించి స్వాగతం పలుకుతున్న రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం

చంద్రబాబును కలిసిన సుగవాసి బాలసుబ్రమణ్యం

రాయచోటిటౌన్, మార్చి 30: రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు టిక్కెట్ కేటాయించినందుకు కృతజ్ఞతగా శనివారం సుగవాసి బాలసుబ్రమణ్యం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును ప్రొద్దుటూరులో కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాగళం సందర్భంగా ప్రొద్దుటూరుకు వచ్చిన చంద్రబాబును హెలీప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు బాలసుబ్రమణ్యంతో మాట్లాడుతూ కష్టపడి పనిచేసి రాజంపేటలో గెలుపు సాధించాలని చెప్పినట్లు ఆయన తెలిపారు.

624 ఫిర్యాదులకు 602 పరిష్కారం

● రూ.79.54 లక్షల విలువైన నగదు, వస్తువులు సీజ్ ● ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్


కంట్రోల్ రూంలో పనిచేస్తున్న సిబ్బంది

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 30: జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై మొత్తం 624 ఫిర్యాదులు అందగా 602 ఫిర్యాదులను పరిష్కరించామి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు మొత్తం 624 ఫిర్యాదులు అందగా 602 పరిష్కరించగా 22 ప్రగతిలో ఉన్నాయన్నారు.


పరిష్కరించిన ఫిర్యాదులు

సీ-విజిల్ ద్వారా 96 ఫిర్యాదులు అందగా 96 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ప్రింట్ మీడియా ద్వారా 55 ఫిర్యాదులు అందగా 54 ఫిర్యాదులను పరిష్కరించామని, ఒకటి ప్రగతిలో ఉందని, కంప్లైంట్ మానిటరింగ్ యాప్/సీఈవో ద్వారా 16 ఫిర్యాదులు అందగా 12 ఫిర్యాదులను పరిష్కరించగా, 4 ప్రగతిలో ఉన్నాయన్నారు. డిస్ట్రిక్ట్ కాల్ సెంటర్ ద్వారా 10 ఫిర్యాదులు అందగా 10 పరిష్కరించామన్నారు. ఎన్‌జీపీఎస్ (1950) ద్వారా 80 ఫిర్యాదులు అందగా 80 పరిష్కరించామని, ఎన్‌జీఎస్‌పీ (సిటిజన్) యాప్ ద్వారా 337 ఫిర్యాదులు అందగా 328 పరిష్కరించామని, 9 ప్రగతిలో ఉన్నాయని, ఆఫ్‌లైన్ ద్వారా 30 ఫిర్యాదులు అందగా 22 పరిష్కరించగా 8 ప్రగతిలో ఉన్నాయని తెలిపారు.

సీజ్ చేసిన నగదు, వస్తువులు


ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ ద్వారా చేపట్టి సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి శనివారం వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ.79.54 లక్షల విలువైన నగదు, వస్తువులను సీజ్ చేశామన్నారు. ఇందులో రూ.42.24 లక్షల మేర నగదు, రూ.17.89 లక్షల విలువైన లిక్కర్, రూ.1.40 లక్షల విలువైన గంజాయి, రూ.18 లక్షల విలువైన బంగారు, వెండి, ఇతర వస్తువులను సీజ్ చేశామని తెలిపారు.

కాలువలు తీసి.. కష్టాల పాల్జేసి..


జగనన్న కాలనీలో పైపులైన్ కోసం తీసిన కాలువ


బొమ్మనచెరువు జగనన్న కాలనీ


కాలనీలోని డంప్ చేసిన హెచ్‌డీపీ నల్లపైపులు


నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు

● నిర్మాణం చేయక.. ఇంటిలోకి వెళ్లలేక

● కాంట్రాక్టర్ వర్సెస్ సబ్ కాంట్రాక్టర్


● ఇళ్ల పురోగతిపై హౌసింగ్ అధికారుల ఆందోళన

● జగనన్న కాలనీలో నత్తనడకన పనులు

మదనపల్లె, మార్చి 30: మదనపల్లె మండలం బొమ్మనచెరువు జగనన్న కాలనీలో పైపులైన్ పనులు జగనన్న కాలనీ లబ్ధిదారులకు అదనపు ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి. కాలనీవాసుల సౌకర్యార్థం పైపులైన్ పనులు చేపట్టిన అధికారులు వాటిని సకాలంలో పూర్తి చేయకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లలో అడ్డదిడ్డంగా తవ్వేసి, ఆపై వదిలేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా ఇంటిపనులు చేసుకోవడానికి దారి లేక.. అక్కడ నివాసాలున్న వారు ఇళ్లలోకి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. మూడు నెలల క్రితం తవ్వేసిన కాంట్రాక్టర్లు తర్వాత పనులు పూర్తి చేయలేదు. అప్పటి నుంచి నిర్మాణాల్లో పురోగతి లేదని గృహ నిర్మాణ శాఖాధికారులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బొమ్మనచెరువు జగనన్న కాలనీలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. జల్‌జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.142 లక్షలతో ఈ పనులు చేపడుతున్న గుంటూరు కాంట్రాక్టర్ స్థానికంగా సబ్ కాంట్రాక్టర్‌కు పనిని అప్పగించారు. బిల్లుల చెల్లింపులో ఇద్దరి మధ్య ఏర్పడిన వివాదంతో పనులు నిలిచిపోయాయని స్థానికులు చెబుతున్నారు.

మదనపల్లె మండలం బొమ్మనచెరువు సమీపంలో పట్టణంలోని ఈశ్వరమ్మకాలనీ, రంగారెడ్డి కాలనీ వాసులకు జగనన్న పథకం కింద ఇంటి స్థలాలు కేటాయించారు. ఇది మండలంలోని పోతబోలు తర్వాత అతిపెద్ద లేఅవుట్ కూడా. పట్టణానికి ఆరు కి.మీ.దూరంలోని ఈ లేఅవుట్‌లో 800 మందికిపైగా ప్లాట్లు కేటాయించగా, 450 మంది ఇంటి నిర్మాణాలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఇప్పటికే 300 గృహాలకు పైకప్పు వరకూ పూర్తి చేయగా, అందులో 25 మంది వరకూ నివాసం ఉన్నారు. ఇక్కడ ఇప్పటికే విద్యుత్తు లైన్లు పూర్తి చేయగా, ఇంటి నిర్మాణాల కోసం బోరు వేసి, కాలనీలో అక్కడక్కడా ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులను నింపుతూ నీటిని అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడ నుంచి పైపుల ద్వారా, బిందెలతో నీటిని పట్టుకుని ఇంటి నిర్మాణాన్ని చేపడుతుండగా, అవకాశం లేని వారంతా ట్యాంకర్లతో నీటిని తోలించుకుంటున్నారు. ఈ క్రమంలో అన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే క్రమంలో ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఇందులో ఇక్కడ రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్ పనులను చేపట్టడానికి గుంటూరుకు చెందిన ఓ కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు. తర్వాత ఈ పనులను సబ్ కాంట్రాక్టర్‌కు ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పనులు చేయడానికి ఉపక్రమించిన సబ్ కాంట్రాక్టర్ ఇదే కాలనీలో కొన్ని ఏరియాలలో కాలువలు తీసి నల్ల హెడ్‌డీపీ పైపులు ఏర్పాటు చేశారు. చేసిన పనులకు కాంట్రాక్టర్ నుంచి బిల్లులు అందకపోవడంతో తర్వాత చేయాల్సిన పనులు ఆపేశారు. ఇప్పటికే కాలనీ వెంబడి తీసిన కాలువలు అలానే ఉండిపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి. ఇప్పటికే ఇంటి నిర్మాణం మొదలు పెట్టిన వారు, ఇంటిని పూర్తి చేసిన వారు అక్కడికి వెళ్లే పరిస్థితి లేదు. ఎందుకంటే ఇంటి ముందు గోతులు తీసేసి మట్టి పోసేయడంతో రాకపోకలకే ఇబ్బందిగా ఉంది. దీంతో అక్కడికి నిర్మాణ సామగ్రిని చేర్చుకోలేక, నీటిని అందుకోలేక లబ్ధిదారులు పనులకు స్వస్తి చెప్పారు. దీంతో జగనన్న ఇళ్ల నిర్మాణం మూడు నెలలుగా పురోగతి మందగించింది. మార్చి నెలాఖరుకు ఇంటినిర్మాణం పూర్తి చేస్తే కేంద్రం ఇచ్చిన నిధులను వినియోగించుకోవచ్చని గృహ నిర్మాణ శాఖాధికారులను పరుగులు పెట్టిస్తుండగా, ఇక్కడ మాత్రం నిర్మాణాలకు ఆటంకం కలగడంపై ఆ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులైనా త్వరతిగతిన పూర్తి చేయాలని లేకుంటే తవ్విన కాలువలు పూడ్చేయాలని వారు డిమాండ్ చేస్తున్నా ఫలితం లేదని వాపోతున్నారు. దీంతో కొందరు లబ్ధిదారులే సొంత ఖర్చులు పెట్టి కాలువలు పూడ్చేసి నిర్మాణాలు చేపడుతున్నారు.

మరోవైపు తాత్కాలికంగా దిమ్మెలు కట్టి ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులు కూడా పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదు. వాటికి నీటిని నింపడంలో కొన్ని ఇబ్బందులు ఉండగా, మరికొన్ని చోట్ల దిమ్మెలు, ట్యాంకులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నిర్మాణంలోని రెండు ఓవర్‌హెడ్ ట్యాంకు పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. కాలనీలోని వీధుల్లో ఏర్పాటు చేయడానికి తెచ్చిన నల్ల హెచ్‌డీపీ పైపులు రోడ్లపై నీరు పట్టడానికి ఎక్కడ పడితే అక్కడ వదిలేశారు. ఇదిలా ఉండగా, కాలనీలో ఏర్పాటు చేసిన రెండు విద్యుత్తు స్తంభాలు, విద్యుత్తు లైన్ కింద పడిపోయి రెండు నెలలు అవుతున్నాఅధికారులు పట్టించుకోవడం లేదు. స్తంభాలు, విద్యుత్తు వైర్లు రోడ్డుపై మట్టిలో కలసిపోయి, రాకపోకలకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. అలాగే పోతబోలు లేఅవుట్‌లో ఇదే పథకం కింద కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ కింద రూ.199 లక్షలతో మూడు ఓవర్‌హెడ్ ట్యాంకులు, బోర్లు, పైపులైన్ పనులు చేపడుతున్నారు. ఇక్కడ కూడా పైపులైన్ పేరుతో కాలువలు తీసేసి నెలల తరబడి పనులు పూర్తి చేయకపోవడంతో జగనన్న ఇంటి లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ సుమారు వంద ఎకరాల్లో పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 4 వేల మందికి స్థలాలు కేటాయించారు. ఇందులో నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రస్తుతం అక్కడ కొనసాగుతున్న పైపులైన్ పనులతో ఇంటి నిర్మాణాలకు ఆటంకం ఏర్పడుతోంది.


శిథిలావస్థకు చేరుకున్న సింటెక్స్ ట్యాంకు

ఇళ్ల నిర్మాణానికి ఇబ్బంది లేకుండా చేస్తాం..

కాలనీ రోడ్లు ఇరుగ్గా ఉండటం, పైగా ఎత్తుపల్లాలుగా ఉండటంతో పనులు ఆలస్యం అవుతున్నాయి. అయినా లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. బొమ్మనచెరువు, పోతబోలు లేఅవుట్లలో ఓవర్‌హెడ్ ట్యాంకులు దాదాపు పూర్తయ్యాయి. ఆలోగా పైపులైన్ పనులు పూర్తి చేస్తాం. అయా ఇళ్ల ముందు లబ్ధిదారులు సోప్‌పిట్స్ తవ్వినందున పైపులైన్ ఏర్పాటుకు గాడి తీయడం నుంచి పైపులు అమర్చడం వరకూ ఇబ్బందిగా ఉంది. మేం తీసిన కాలువల వల్ల..హౌసింగ్ అధికారులకు ఇబ్బంది లేదు కానీ..వారు తీసిన సోప్‌పిట్స్ (ఇంటిలోని మురికినీరు ఇంకిపోవడానికి తీసిన గుంతలు)తో పైపులైన్ పనులకు అడ్డంకిగా మారింది. కాంట్రాక్టర్‌కు టెండర్ గడువు మరో నాలుగు నెలలు ఉంది. ఆలోగా అన్ని పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

- కె.చందన, ఏఈ,
గ్రామీణ నీటి సరఫరా విభాగం

పుష్పగిరి క్షేత్రంలో హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్


జస్టిస్ సీతారామమూర్తి శర్మను సన్మానిస్తున్న అర్చకులు

వల్లూరు, మార్చి 30 : ప్రసిద్ధిగాంచిన పుష్పగిరిని స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ జస్టిస్ సీతారామ మూర్తి శర్మ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వాములను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయనను ఆలయ అధికారులు సన్మానించారు. ఆలయ అర్చకుడు సుమన్ దీక్షితులు పుష్పగిరి చరిత్రను తెలియజేశారు. వీరివెంట తహసీల్దారు అమర్‌నాథ్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

సంగమేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు


హుండీలోని కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

వీరపునాయునిపల్లె, మార్చి 31: మండల పరిధిలోని సంగమేశ్వర ఆలయంలో శనివారం ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి ఆద్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. శనివారం లెక్కించిన ఈ హుండీలలో రూ.3,80,100 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి, ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాలక మండల సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలు విరాళం


అన్నదాన పథకానికి విరాళం అందిస్తున్న భక్తులు

చక్రాయపేట, మార్చి 30: గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.50వేలు విరాళం అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవల పాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. శనివారం పులివెందులకు చెందిన ఎడుగూరి శ్రీనివాస రెడ్డి ధర్మపత్ని స్వర్ణలత వారి కుటుంబ సభ్యులు రూ.25,116, వివిధ భక్తుల నుంచి వచ్చిన మొత్తం కలిపి రూ.50వేలు విరాళం వచ్చినట్లు తెలిపారు.

ఉత్తర్వులు లేనిదే నిర్మాణాలు చేయరాదు

బ్రహ్మంగారిమఠం, మార్చి 30 : బ్రహ్మంగారిమఠం మండలంలోని పలు ప్రభుత్వ భూముల్లో ఉత్తర్వులు లేనిదే కట్టడాలు కట్టరాదని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం దగ్గరలో ఉన్న సర్వేనెం.425, 426/2లో నాలుగు ఎకరాల్లో నిర్మాణాలు చేయడానికి స్థానిక పంచాయతీ అధికారులు అప్రూవల్ ఇవ్వాలన్నారు. రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో అనుమతులు ఇచ్చినప్పుడే కట్టడాలు చేపట్టాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. శనివారం సర్వే నెం.426లో నిర్మాణ పనులను రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. స్థలం యజమానులు తహసీల్దారు కార్యాలయానికి పిలిపించి రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినప్పుడే మీరు కట్టడాలు చేపట్టాలన్నారు. అంత వరకు ఆ స్థలంలో ఎవరే కానీ కట్టడాలను చేపట్టరాదని తహసీల్దారు తెలిపారు.

శ్మశానంలో షెల్టరు కూల్చివేత.. గ్రామస్తుల ఆందోళన

బ ద్వేలు రూరల్, మార్చి 30 : మండల పరిధిలోని శివరామనగర్, శ్రీనివాసనగర్ గ్రామాలకు చెందిన శ్మశానం విషయంలో ఏర్పడిన వివాదంతో శనివారం రెండు గ్రామాలకు చెందిన ప్రజలు రోడ్డు దిగ్బంధం చేసి ఆందోళనకు దిగారు. స్థానిక శ్రీనివాసనగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఇటీవల మరణించడంతో అతనిని స్థానిక శ్మశానంలో దహనం చేశారు. ఆ ప్రాంతంలో ఓ షెల్టరు ఏర్పాటు చేసేందుకు అతని కుమారులు ప్రయత్నాలు చేశారు. దీనికి రెండు గ్రామాల ప్రజలు ఒప్పుకోకపోవడంతో కొద్దిరోజులుగా వివాదం సాగుతోంది. శనివారం శ్మశానంలో ఉన్న షెల్టరును కూల్చివేయడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో రూరల్ పోలీసులు, రెవెన్యూ అధికారులు వెళ్లి గ్రామస్థులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

చౌడేశ్వరి ఉత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి దేవి

వల్లూరు, మార్చి 30 : మండలంలోని వెంకటాపురం వీవర్స్‌కాలనీలో శనివారం చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామునే ఆలయంలో పూజలు చేశారు. ఉదయం గ్రామం లో చల్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సరిహద్దుల్లో గ్రామ దేవతలకు పూజలు చేశారు. అమ్మవారికి జలాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. . సాయంత్రం బిందె సేవ నిర్వహించారు. గ్రామంలోని గంగమ్మ ఆలయం వద్దకు మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవంగా వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం గంగకు పూజలు నిర్వహించి బిందెలతో నీటిని చౌడేశ్వరి మాత ఆలయానికి చేరుకున్నారు.

చీనీ తోటలకు బంక తెగులు

● దిగుబడిపై తీవ్ర ప్రభావం ● ఆందోళనలో రైతులు


కాయలతో ఉన్న చీనీ తోట (ఇన్‌సర్ట్) బంక తెగులుతో వాడిపోయిన చీనీ చెట్టు

ముద్దనూరు మార్చి 30: చీనీ తోటలకు తెగులు సోకింది. బంక కారి చెట్లు వాడిపోతున్నాయి సీజన్‌లో తెగులు సోకడంతో దిగుబడి తగ్గి, నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చీనీ రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో కొర్రపాడు, గంగాదేవిపల్లె, ఓబులాపురం, మంగపట్నం చీనీతోటలకు పెట్టింది పేరు. దాదాపు 2వేల ఎకరాల్లో ఈ గ్రామాల్లో చీనీ తోటలు సాగు చేస్తున్నారు. గండికోట ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌కు సమీపంలో గ్రామాలు ఉన్నాయి. ప్రాజెక్టులో నీటి నిల్వ తగ్గిపోవడంతో బోర్లల్లో నీరు అంతంతమాత్రంగానే వస్తోంది. దానికి తోడు చీనీ చెట్లకు బంక తెగులు సోకడంతో వాడిపోతున్నాయి. ఆరు నుంచి 15 ఏళ్ల చరాల చెట్లు తెగులును తట్టుకోలేకపోతున్నాయి. దీంతో దిగుబడి కూడా తగ్గిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెట్లు చనిపోతున్నాయి



తెగులు విపరీతంగా ఉంది. బంక కారి చెట్టు వాడిపోయి, చనిపోతోంది. నాకు దాదాపు 15 ఏళ్లలోపు చెట్లు 300 ఉన్నాయి. వాటిలో 30 చెట్లు బంకకారి ఎండిపోయాయి. ఎన్ని మందులు వేసినా ఫలితంలేదు. కాయలు వస్తున్న సమయంలో తీవ్రంగా నష్టపోతున్నాం.

\- కేశవరెడ్డి, చీనీ రైతు, గంగాదేవిపల్లె

వర్షం రావాల్సిందే..

ముద్దనూరు, తొండూరు మండలాల్లో చీనీ చెట్లకు తెగులు సోకింది. ఎండ తీవ్రతతోపాటు, భూమిలో వేడి ఎక్కువగా ఉండటం, నీటి శాతం తగ్గిపోవడంతో బంక తెగులు సోకింది. ఒక్క వర్షం పడితే చెట్లు కోలుకునే పరిస్థితి ఉంటుంది. వర్షం పడకుంటే చెట్లను కాపాడటం కష్టం.

\- మల్లేశ్వరరెడ్డి, ఉద్యానశాఖాధికారి, ముద్దనూరు

లింగ నిర్ధారణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

● మాతృమరణాలపై డీఎంహెవో డాక్టర్ కొండయ్య సమీక్ష


మాతృమరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, మార్చి 30: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో పాటు మాతృ మరణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం, మాతృ మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రిజిస్టరైన 117 స్కానింగ్ సెంటర్లలో గర్భిణు స్కానింగ్, ఆసుపత్రిలో జరిగే గర్భస్రావాల రిపోర్టులను తప్పనిసరిగా ప్రతి నెల 2వ తేదీలోగా రాయచోటిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి పంపాలన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా జిల్లాలో పెద్దమండెం, కంబకూరు, నందలూరు, రాజంపేట, ఈడిగపాలెం మండలాల్లో జరిగిన మాతృ మరణాలకు కారణాలు, మరణాల నియంత్రణకు ఏ విధంగా చర్యలు తీసుకోవాలనే అంశాలపై కమిటీ సభ్యులు డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ వెంకటశివ, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ జీనత్‌బేగం, డాక్టర్ డేవిడ్ సుకుమార్‌తో చర్చించారు. గర్భిణుల వివరాలు నమోదు చేయడం, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను గుర్తించి తగిన ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. ఆయుష్మాన్ భారత్, బేటీ బచావో, బేటీ పడావో, సేవ్ ద గర్ల్ చైల్డ్ పథకాలపై అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే తల్లులకు గర్భిణులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, 102 వాహన నిర్వహణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు తుది అవకాశం

● బదిలీ, దిద్దుబాటుకు సైతం చాన్స్
● రానున్న ఎన్నికల్లో ఓటేసేందుకు అవకాశం
● ఏప్రిల్ 15 వరకు గడువు

పులివెందుల టౌన్, మార్చి 30: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడులైన నేపథ్యంలో పాలకులను ఎన్నుకునేందుకు ఓటర్లంతా సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలో ఓటరకు తన ఓటు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలి, లేకుంటే వెంటనే నమోదు చేసుకోవాలి. దీని కోసం ఎన్నికల సంఘం 15వ తేదీ వరకు తుది గడువు పొడిగించింది. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నామినేషన్ల ప్రక్రియ ముగింపునకు పది రోజుల నాటికి వచ్చిన ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ఎన్నికల్లో ఓటు వేసేందుకు అవకాశం కల్పించాల్సి ఉంది. పులివెందుల నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన నేతలు గతంలో ఓటు మార్పులు, చేర్పులపై ఫిర్యాదులు చేయడం జరిగింది. ఫారం-7 ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఓటర్లను గుర్తించాలని ఫిర్యాదులు చేశారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితాలో ప్రజలు తమ పేరును పరిశీలించుకొని తమ ఓటు లేని పక్షంలో వెంటనే దరఖాస్తు చేసుకుంటే ఓటు హక్కు కల్పిస్తారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు చేసుకోవడం ఎలా?

ఓటరు నమోదు, ఓటు బదిలీ, వివరాల దిద్దుబాటు తదితర సేవల కోసం కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ఓటర్స్.ఈసీఐ.జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకొని కూడా ఈ సేవలను పొందవచ్చు. స్థానిక బూత్ స్థాయి అధికారి, బీఎల్‌ఓ, ఓటరు నమోదు, అధికారులకు దరఖాస్తులను అందజేయాలి. ఓటరు నమోదు కోసం కొత్తగా దిగిన ఫోటోతో పాటు చిరునామా, వయసు, ధృవీకరణ కోసం 10వ తరగతి మార్కుల జాబితా ఆధార్, రేషన్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌బుక్కులు, విద్యుత్ బిల్లులు సైతం సమర్పించాలి. ఓటరు జాబితాలో పేరు ఉందా లేదా అనేది తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఎలక్టోరల్ సెర్చ్.ఈసీఐ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తుంది. ఓటరు వివరాలు, గుర్తింపు కార్డు, మొబైల్ నెంబర్ ఆధారంగా జాబితాలో పేరును సెర్చ్ చేయడానికి ఈ పోర్టల్ అవకాశం కల్పిస్తుంది.

వివాదాస్పద, ఫేక్ న్యూస్ పోస్ట్ చేస్తే ఐదేళ్లు జైలు శిక్ష

● సోషల్ మీడియాలో పోస్టులకు అడ్మిన్‌దే బాధ్యత

కడప(కలెక్టరేట్), మార్చి 30: అడిగే వారు లేరని, ఏదో ఒక పార్టీకి అనుకూలంగా గ్రూపుల్లో, సోషల్ మీడియాలో పెట్టే ప్రతి పోస్టుకు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం హెచ్చరించింది. వివాదాస్పద పోస్టులు క్షుణ్ణంగా పరిశీలించిన మీదటే ప్రచురించుకోవాలి. నిబంధనలకు వ్యతిరేకంగా వివాదాస్పదంగా, ఫేక్ న్యూస్‌లు పెట్టి, గ్రూపుల్లో షేర్ చేసే వ్యక్తులతో పాటు, అడ్మిన్‌ను నేరస్తుడిగా పరిగణించి ఐదేళ్లు జైలు శిక్ష విధించేలా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. వివాదాస్పద పోస్టులు పెట్టే వారిపై ఐపీసీ సెక్షన్ 1534 కింద ఐదేళ్ల జైలు శిక్ష తప్పదు. విద్వేషాలు రెచ్చగొట్టే, వర్గపోరుకు దారి తీసే, దేశ భద్రతకు ముప్పు కల్గించే సందేశాలు, అంశాలను గ్రూపుల్లో పెట్ట రాదు. అవాస్తవ కథనాలు, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలు, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు, పోర్న్ క్లిప్స్, వీడియోలు ఇతర గ్రూపులకు, వ్యక్తులకు షేర్ చేస్తే ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరించనుంది.

నిర్లక్ష్యం నీడలో గ్రామ పంచాయతీ కార్యాలయం

● ఆక్రమణబారిన ప్రభుత్వ స్థలం ● ఫిర్యాదు చేసినా.. పట్టించుకోని అధికారులు



అంబవరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా కంపచెట్లు


గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేసిన గడ్డివాములు

జమ్మలమడుగు, మార్చి 30: ప్రభుత్వ భవనాలు దుర్వినియోగమవుతున్నా, అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జమ్మల మడుగు ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. జమ్మలమడుగు మండలంలోని ముద్దనూరు రోడ్డులో కొత్త రోడ్డు సున్నపురాళ్లపల్లెకు వెళ్లే దారిపక్కనే అంబవరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఉంది. ఆ భవనానికి వెళ్లే దారిని అధికారపార్టీకి చెందిన ఓ కార్యకర్త దౌర్జన్యంగా ఆక్రమించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో సుమారు రెండేళ్లుగా గ్రామ పంచాయతీ కార్యాలయం మూతపడింది. దీంతో పరిసరాల్లో కంపచెట్లు పెరిగాయి. దీంతో ఆ వ్యక్తి భవనానికి ఒకవైపు గడ్డివామి వేసి, గేదెలను కట్టివేసి ఆ స్థలాన్ని ఆక్ర మించు కున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకే రక్షణ లేకుండా పోవడంతో ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అంబవరం గ్రామ పంచాయతీ సెక్రటరీ అరుణ్‌ను వివరణ కోరగా తాము అప్పట్లో పనిచేసిన రెవెన్యూ అధికారి మధుసూదన్‌రెడ్డికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇదే సమస్యను ప్రస్తుతం జమ్మలమడుగు తహసీల్దారు కరుణాకర్ దృష్టికి తీసుకెళ్లగా తాను కొత్తగా వచ్చానని, త్వరలో పరిశీలిస్తానన్నారు.

ఆర్థిక శాస్త్రంతో ఉజ్వల భవిష్యత్

● 40వ రాష్ట్ర స్థాయి సదస్సులో వక్తలు


సదస్సు ప్రారంభిస్తున్న మోహన్‌రావు తదితరులు

మదనపల్లె టౌన్, మార్చి 30: నేటి సమాజంలో ఇంజినీరింగ్, సైన్సుతో పాటు ఆర్థికశాస్త్రంతో ఉజ్వల భవిష్యత్ ఉందని ఏపీ ఎకనామిక్ అసోసియేషన్ చైర్మన్ మోహన్ రావు పేర్కొన్నారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఏపీ ఎకనామిక్ అసోసియేషన్ 40వ రాష్ట్ర సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ పెట్టుబడి, ఉత్పత్తి, మార్కెటింగ్ విక్రయాలు అనే నాలుగు అంశాలు ఆర్థికశాస్త్రం పరిధిలో వస్తాయని వాటిపై డిగ్రీ స్థాయిలోనే విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ హరినారాయణ మాట్లాడుతూ మానవునికి అందుబాటులో వున్న వనరులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఎస్వీ యూ మాజీ రిజిస్ట్రార్ దేవరాజులు మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్య కు 22నుంచి 25 శాతం బడ్జెట్ కేటాయించాలన్నారు. అనంతరం 50 డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీల నుంచి వచ్చిన ఎకనమిక్స్ ప్రొఫెసర్లు పేపర్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమలో కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, అధ్యాపకులు శివరామయ్య, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశాల్లో విశ్వం విద్యార్థుల హవా



సైనిక్ స్కూల్లో ప్రవేశాలు సాధించిన విశ్వం విద్యార్థినులు

తిరుపతి(విద్య), మార్చి 30: బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశాల్లో తమ విద్యా ర్థులు ప్రభం జనం సృష్టించారని విశ్వం విద్యా సంస్థల అధినేత ఎన్. విశ్వనాథ రెడ్డి తెలిపారు. బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలి తాలు శనివారం విడుదలయ్యాయని, విశ్వంలో శిక్షణ పొందిన వంశితశ్రీ, మనోజ్ఞబాయి, సోనిక, దర్శిణిశ్రీ, నిత్యశ్రీ, వర్షిణి సైనిక్ స్కూల్ ప్రవేశం సాధించారన్నారు. జాతీయ స్థాయిలో అత్యధిక మార్కులు, ఉత్తమ ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎన్.తులసి విశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి అభినందించారు.

సరిహద్దు చెక్‌పోస్టులో తనిఖీలు

పెద్దతిప్పసముద్రం మార్చి 30 : కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులను శనివారం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఈఎస్ వి. శ్రీనివాస్ తనిఖీ చేశారు. అంకాల మడుగు చెక్‌పోస్టును మొలకలచెరువు ఎస్ఈబీ సీఐ రామ్మోహన్‌తో కలసి తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి అక్రమంగా డబ్బులు, మద్యం లాంటివి తరలించకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ఏసీబీ వలలో వీఆర్వో

● మ్యుటేషన్ ఆమోదం కోసం లంచం డిమాండ్ ● రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత


వీఆర్వో యల్లయ్య

పీలేరు, మార్చి 30: కేవీపల్లె మండలంలో ఓ రైతుకు సంబంధించిన మ్యుటేషన్ వ్యవహారంలో లంచం తీసుకుంటున్న వీఆర్వోను ఏసీబీ అధికారులు శనివారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ కడప డీఎస్పీ గిరిధర్ కథనం మేరకు... కేవీపల్లె మండలం గోరంట్ల పల్లె పంచాయతీ బసిరెడ్డిగారిపల్లె వడ్డిపల్లెకు చెందిన రైతు మల్లయ్య భూమికి సంబంధించిన రికార్డుల్లో తప్పులు దొర్లాయి. వాటిని సరిదిద్దేందుకు గత నెలలో మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఆయన భూమి అదే గ్రామానికి చెందిన మూడు సర్వే నెంబర్లలో ఉండడం, వాటిలో రెండు సర్వే నెంబర్లలో ఆయన భూమి దరఖాస్తు పట్టాగా నమోదు కావడంతో దానిని మార్చేందుకు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. మ్యుటేషన్‌ను ఆమోదించేందుకు సొరకాయలపేట గ్రామ సచివాలయ వీఆర్వో యల్లయ్య రూ.9 వేలు లంచం డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని రైతు పలుమార్లు ప్రాధేయపడగా రూ.5 వేలకు ఒప్పుకున్నాడు. వీఆర్వో వ్యవహారంతో విసిగిపోయిన మల్లయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు ఆ డబ్బు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని వీఆర్వోకు తెలుపగా శనివారం సచివాలయం వద్దకు రమ్మన్నాడు. సచివాలయంలో అతను లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీఆర్వో యల్లయ్యను నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు. దాడిలో ఏసీబీ సీఐలు మహమ్మద్ అలీ, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


మృతి చెందిన మహిళ

జమ్మలమడుగు, మార్చి 30: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతిచెందింది. మండలంలోని గొరిగనూరు ఎస్సీ కాలనీకి చెందిన నీరుకట్టి రామసుబ్బమ్మ (50) వ్యవసాయ కూలీ. శనివారం సాయంత్రం సుబ్బరాయుడు అనే రైతు ఇంట్లో చప్పట బండలు కడుగుతూ ప్లగ్ బాక్స్‌ను పట్టుకుంది. దీంతో విద్యుదాఘాతానికి గురైంది. వెంటనే ఆమెను జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ విషయంపై అర్బన్ పోలీసులకు సమాచారం అందించినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. మృతురాలి భర్త హమాలీ కాగా, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

రూ.5 లక్షల నగదు స్వాధీనం

కమలాపురం రూరల్, మార్చి 30 : ఎన్నికల నిబంధనల్లో భాగంగా కమలాపురం సమీపంలోని పెట్రోలు బంకు వద్ద శనివారం రూ.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సరస్వతి తెలిపారు. ఆమె సమాచారం మేరకు... కడప నుంచి అనంతపురం వైపు వెళుతున్న కారును ఆపి తనిఖీ చేయగా ఆ మొత్తం పట్టుబడిందన్నారు. నగదు యజమాని అనంతపురానికి చెందిన వెంకటశేషారెడ్డి ఎలాంటి రసీదులు చూపపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

15 బీర్ బాటిళ్ల పట్టివేత


పట్టుబడిన బీర్ బాటిళ్లు, నిందితుడితో పోలీసులు

కలసపాడు, మార్చి 30 : మండల కేంద్రంలో శనివారం ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని 15 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోరుమామిళ్ల సర్కిల్ సీఐ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ అక్రమ మద్యం కలిగి ఉన్నా, తరలిస్తున్నా కఠిన చర్యలు తప్పవన్నారు. అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్నా, బెల్టుషాపులు నిర్వహిస్తున్నా పోలీసులకు తెలపాలని, తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు తెలియజేస్తున్న సీఐ చాంద్‌బాషా

వేంపల్లె, మార్చి 30: వేంపల్లె పట్టణంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 24న నాగేంద్ర అనే వ్యక్తి శివ, నరసింహులు, శ్రీనివాసులుపై కత్తితో దాడి చేశాడు. కత్తిపోట్లకు గురైన నరసింహులు చికిత్స పొందుతూ ఈనెల 26వ తేదీన మృతిచెందాడు. శివ, శ్రీనివాసులు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ కేసులో నిందితుడు నాగేంద్రను శనివారం మధ్యాహ్నం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

వాల్మీకిపురం, మార్చి 30: పట్టణ సమీపంలోని పునుగుపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు అరుణ్‌కుమార్(22) శుక్రవారం అర్ధరాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మ హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కదిరి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన జనసేన అభ్యర్థి



కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి సన్మానిస్తున్న భాస్కర్‌రావు

రైల్వేకోడూరు, మార్చి 30: మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని కలికిరిలోని ఆయన నివాసంలో శనివారం బీజేపీ, టీడీపీ బలపరిచిన జనసేన అభ్యర్థి యనమల భాస్కర్‌రావు కలిశారు. రైల్వేకోడూరు రాజకీయ పరిస్థితులపై కిరణ్‌కుమార్‌రెడ్డికి భాస్కర్‌రావు వివరించారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో రాజంపేట పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలతో పాటు రైల్వేకోడూరు, రాయచోటి, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె స్థానాలను గెలుచుకునేందుకు ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారాలు చేయాలన్నారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

విద్యుత్‌ను ఆదా చేయాలి

- కేజీబీవీ ప్రిన్సిపాల్ పుష్పలత



విద్యుత్ ఆదాపై డ్రాయింగ్ వేసి చూపిస్తున్న విద్యార్థులు

రామాపురం, మార్చి 30: విద్యుత్ ఆదా ప్రతి ఒక్కరి బాధ్యత అని రామాపురం కస్తూర్బా బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పలత అన్నారు. మండల పరిధిలోని స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో శనివారం ఎంజేపీ ఏపీబీసీ డబ్ల్యు ఆర్ఈఐ సొసైటీ ఆదేశాల ప్రకారం ఎనర్జీ కన్జర్వేషన్‌కు సంబంధించి విద్యార్థులకు విద్యుత్ ఆదాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎనర్జీ కన్జర్వేషన్‌కు సంబంధించి విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించారు. పాఠశాల స్థాయిలో డ్రాయింగ్, ఎస్ఏ రైటింగ్‌లు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు





శిక్షణా శిబిరంలో పాల్గొన్న సిబ్బంది, ప్రసంగిస్తున్న రాజంపేట నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు

రాజంపేట, మార్చి 30: రాజంపేట నియోజకవర్గ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శనివారం నియోజకవర్గ ఎన్నికల సిబ్బందికి ఎన్నికల శిక్షణా తరగతులు నిర్వహించారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి టి.మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణా తరగతుల కార్యక్రమంలో పీవోలు, ఏపీవోలు, 469 మంది ఎన్నికల సిబ్బందికి ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రోజు, అంతకు ముందు రోజు సిబ్బంది నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల గురించి తెలిపారు. ఈ సందర్భంగా వారి విధివిధానాలపై వీడియో ద్వారా విధులు, బాధ్యతలపై క్షుణ్ణంగా వివరించారు.

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం



ఓటర్లను అభ్యర్థిస్తున్న లక్ష్మిప్రసాద్‌రెడ్డి

గాలివీడు, మార్చి 30: రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని తద్వారా అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గాలివీడు పంచాయతీలో రాంప్రసాద్ రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం గాలివీడు మండలానికి చేసింది శూన్యమని, టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల వారికి న్యాయం, అభివృద్ధి జరిగిందని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలను అమలు చేసి బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహమ్మద్ రియాజ్, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య టీడీపీ నాయకుడు కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతకు గురికాకుండా జాగ్రత్తలు పాటించండి

ఎండ తీవ్రతకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ వారి ఆదేశాలతో ఎంపీడీవో శ్రీనివాసులు కొన్ని సూచనలు చేశారు. గర్భిణులు, చిన్నపిల్లలు, వయోవృద్ధులు మధ్యాహ్నం తరువాత బయట తిరగరాదన్నారు. అత్యవసరమైతే గొడుగు, టోపీ, రుమాలు ధరించి వెళ్లాలన్నారు. ముఖ్యంగా ఎండలో నుంచి వచ్చిన వెంటనే నీరు, నిమ్మరసం, కొబ్బరినీళ్లు, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ నీటిని సేవించాలన్నారు. తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లినప్పుడు తలతిరుగుట, వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వడదెబ్బగా గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రాకపోతే శీతల వాతావరణంలో దగ్గరలోని ప్రాథమిక కేంద్రానికి తరలించాలన్నారు.

కష్టపడే వారికి గుర్తింపు లేదు

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఒక నియంత ● వైసీపీ యువజన విభాగం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 30: రాయచోటి వైసీపీలో కష్టపడే వారికి గుర్తింపు లేదని, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఒక నియంతలా వ్యవహరిస్తున్నారని వైసీపీ యువజన విభాగం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.మదన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఆయన పార్టీ సభ్యత్వంతో పాటు వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి శనివారం రాజీనామా చేసి మీడియాతో మాట్లాడారు. పార్టీలో తోటి నాయకులు, కార్యకర్తలను అణగదొక్కుతూ సెకండ్ కేటగిరీ నాయకులను ఎదగనివ్వకుండా చేస్తున్నారని, రాష్ట్ర పదవులన్నీ ఆయనే తీసుకొంటున్నారన్నారు. పార్టీ విజయం కోసం కష్టపడి కేసులు పెట్టుకునే వారిని గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ఉమ్మడిగా ఉన్న సమయంలో పార్టీ కోసం ఎంతో కష్టపడ్డామని, సీఎం జగన్ వైసీపీ స్థాపించినప్పటి నుంచి పార్టీ కోసం పోరాటాలు చేసి ధర్నాలు, రాస్తారోకోలు, ఉద్యమాలు చేశారన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఫామ్ ఇవ్వకపోయినా ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచిన అనంతరం వైసీపీ పార్టీకి సంబంధించిన బీఫామ్ ఇచ్చారని, ఇలా అడుగడుగునా ఎన్నో అవరోధాలు, అడ్డంకులు, ఇబ్బందులు పడ్డానన్నారు. పార్టీలో ఆరుగాలం కష్టపడ్డా తగిన గుర్తింపు లేదని, పార్టీకి సంబంధం లేని వ్యక్తులు, సామాన్య వక్తులకు ఎమ్మెల్యే గుర్తింపు ఇస్తున్నారని ఆరోపించారు.

పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఎగువ అబ్బవరం, దిగువ అబ్బవరం, రెడ్డివారిపల్లె, మాసాపేట, దిబ్బలబడి, గర్ల్స్‌హైస్కూల్ తదితర ప్రాంతాల్లో టీడీపీ కంచుకోటగా ఉన్న ప్రాంతాల్లో సైతం ఏజెంట్‌గా తిరిగి ఘర్షణలు, కేసులు నమోదైన సంఘటనలు చోటుచేసుకున్నాయని వాపోయారు. వైసీపీలో ఆరుగాలం కష్టపడుతున్న తమకు బయట వాళ్లతో ఇబ్బందుల కంటే ఎమ్మెల్యేతోనే ఎక్కువ ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ఈ విషయాలను పలుమార్లు పార్టీ సలహాదారుడు సజ్జల రామక్రిష్ణారెడ్డి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వివరించినా ఫలితం లేదన్నారు. ఎమ్మెల్యే వల్ల సొంత పార్టీలో ఇమడలేకనే స్వచ్ఛందంగా పార్టీ నుంచి బయటకు వస్తున్నామని తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణ రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని ఆయన వివరించారు.

బీసీలకు రాజ్యాధికారం ఇచ్చిన ఘనత టీడీపీదే

● మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, మార్చి 30: బీసీలకు రాజ్యాధికారం ఇచ్చిన ఘనత టీడీపీదే అని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన జయహో బీసీ సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం టీడీపీ అహర్నిశలు పనిచేస్తోందన్నారు. 1982 వరకు ఏపీలో ఎక్కడ ఏ కులం ఉందో, బీసీలు ఎక్కడున్నారో కూడా తెలియదని, అటువంటి వారిని ఒక వేదికపైకి తెచ్చి సర్పంచులుగా, ఎంపీటీసీలుగా చేయడమే కాకుండా పార్లమెంట్‌కు, ఇటు అసెంబ్లీకి పంపించిన ఘనత టీడీపీదే అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, రవీంద్రారెడ్డి, బీసీ జనరల్ సెక్రటరీ రెడ్డెప్ప, కురబ సంఘం అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్, బెస్త సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, రజక సంఘం అధ్యక్షుడు జ్ఞానమూర్తి, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్ప, మాజీ సర్పంచ్ నూర్‌బాషా, సాధికార సంఘం అధ్యక్షుడు సాంబశివయ్య తదితరులు పాల్గొన్నారు.

అరాచకాన్ని సాగనంపండి

అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపి అభివృద్ధి చేసే టీడీపీకి ఓటేయాలని ఎన్నికల ప్రచారంలో రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి కుమారుడు నిశ్చల్ నాగిరెడ్డి, సోదరుడు రాహుల్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నర్సుపల్లె గ్రామంలో ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన నాయకులకు టీడీపీ అభిమానులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామస్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: టీడీపీకి ఓట్లు వేసి గెలిపిస్తేనే రాయచోటి అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన 24, 25వ వార్డుల్లో రెండవ రోజు ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన రాయచోటిలో టీడీపీ గెలుపే లక్ష్యంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తూ ముందుకు సాగారు. ప్రతిఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి రాయచోటి అసెంబ్లీ స్థానంతో పాటు పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్ బాషా, కౌన్సిలర్, అర్చన విద్యాసంస్థల కరస్పాండెంట్ మదన్‌మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను సన్మానించిన గ్రామస్తులు

రాయచోటిటౌన్, మార్చి 30: అన్నదాత, ప్రముఖ పారిశ్రామికవేత్త కోడి శ్రీనివాసులరెడ్డిని శనివారం సంబేపల్లె మండలం దుద్యాల వడ్డెపల్లె ప్రజలు కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. దుద్యాల గ్రామం వడ్డెపల్లెలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వర ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ నెల 25, 26, 27వ తేదీల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన వేలాది మంది భక్తులకు మూడు రోజుల పాటు, మూడు పూటలా నాలుగు వేల మందికిపైగా భోజనాలను శ్రీనివాసులరెడ్డి ఏర్పాటు చేశారు. అందుకు కృతజ్ఞతగా వడ్డెపల్లె గ్రామంలోని ఆలయ కమిటీ సభ్యులు రమణ, పల్లపు కోటేశ్వర, సుబ్బరాయుడు తదితరులు శ్రీనివాసులరెడ్డిని కలిసి శాలువా, పూలమాలతో సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

సుబ్రమణ్యంను కలిసిన టీడీపీ నేతలు

వీరబల్లి, మార్చి 30: మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ నేతలు శనివారం రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యంను మర్యాదపూర్వకంగా కలిశారు. మీ విజయానికి మా సంపూర్ణ సహకారం అందిస్తామని ఆయనకు తెలియజేశారు. పార్టీ విజయం కోసం శక్తివంచన లేకుండా తమవంతు కృషి చేసి చంద్రబాబును సీఎంగా చూడాలన్నదే తమధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో చలపతినాయుడు, చంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను శనివారం మండలంలోని టీడీపీ నాయకులు ఆయన స్వగృహంలో కలిసి అభినందించారు. మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, రాజంపేట నాయకులు రుద్ర కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో పనిచేసే టీడీపీ జెండాను ఎగురవేయాలని ఆయన సూచించారు.

అలరించిన పౌరాణిక నాటకం

చిట్వేలి, మార్చి 30: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నగిరిపాడు రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. ముద్రపల్లె గ్రామస్తులు ఇండ్లూరు వజ్రశేఖర్‌రెడ్డి, సునీతమ్మ కుటుంబ సభ్యులచే మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున ప్రజలు ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు. నగిరిపాడు, జెట్టివారిపల్లె, మల్లెంపల్లె, ఎగువపల్లె, కందులవారిపల్లె, చిట్వేలి, పెద్దూరు, నాగవరం, గొల్లపల్లె, ఉప్పరపల్లె, కోపురోపల్లె తదితర గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరనాయుడు, ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్యనాయుడు, ఉపాధ్యక్షుడు శంకరయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆర్.నరసరామయ్య, ట్రెజరర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు: సీఐ

లక్కిరెడ్డిపల్లె, మార్చి 30: పల్లెల్లో పోలింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్‌గంగనాధబాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని పాళెంగొల్లపల్లె, చింతకుంట వాండ్లపల్లె, రెడ్డివారిపల్లె, లక్కిరెడ్డిపల్లె గ్రామాల్లో స్పెషల్ పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చని, ఎవరికి బయపడాల్సిన అవసరం లేదని ఆయన ఓటర్లకు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విష్ణువర్ధన్ హెడ్ కానిస్టేబుల్ రామ్‌ప్రసాదు, స్పెషల్ పోలీసులు పాల్గొన్నారు.

నడకతో జీవన ప్రమాణం పెంపు

రాజంపేటటౌన్, మార్చి 30: ప్రతి రోజూ 45 నిమిషాల పాటు నడవడం ద్వారా వ్యక్తి జీవన ప్రమాణాన్ని పెంపొందించుకోవచ్చని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పాతబస్టాండు నుంచి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున వాకర్స్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ప్రతి వ్యక్తి 45 నిమిషాల పాటూ జీవనప్రమాణంలో భాగంగా నడక నిర్వహించాలన్నారు. దీని వల్ల ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తులకు సంబంధించిన పలు సమస్యలను దూరం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని పలువురు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సంబేపల్లె, మార్చి 30: కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని గుట్టపల్లి గ్రామం బావులకాడపల్లి క్రాస్ వద్ద శనివారం ఇండికా కారు ఢీకొన్న సంఘటనలో వెంకటేశ్వర అనే వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల మేరకు... గుట్టపల్లె కస్బాకు చెందిన వెంకటేశ్వర్లు తన ద్విచక్ర వాహనంలో పొలం వద్దకు వెళుతుండగా బావులకాడపల్లి క్రాస్ వద్ద మలుపు తిరుగుతుండగా పీలేరు వైపు నుంచి రాయచోటి వైపు వెళ్తున్న ఇండికా కారు ఢీకొనడంతో గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ఒంటిమిట్ట, మార్చి 30: మండల కేంద్రంలోని ఒంటిమిట్ట హరిజనవాడకు చెందిన నక్కల మాలతి గత రెండు రోజుల నుంచి కనబడటం లేదని పోలీసులకు భర్త రాము శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టినట్లు ఎస్ఐ మధుసూధన్‌రావు తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని కోరారు.

వైసీపీ నుంచి బీజేపీలోకి చేరిక



మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన పులపత్తూరు రామసుబ్బారెడ్డి

ఓబులవారిపల్లె, మార్చి 30: మండలంలోని మంగంపేటలో ఉన్న పులపత్తూరు కుటుంబం గత కొంతకాలంగా వైసీపీకి దూరంగా ఉన్నారు. డేంజర్ జోన్ గ్రామాలుగా ఉన్న మంగంపేట కాపుపల్లి హరిజనవాడ, అరుంధతివాడ గ్రామ ప్రజలకు ప్రభుత్వం నుంచి సరైన న్యాయం జరగడం లేదని వారు ఆరోపిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో శనివారం స్థానిక బీజేపీ నియోజకవర్గ నాయకుడు గడ్డం చెంగల్‌రాజు, జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, ఇన్‌చార్జి చంద్రమౌళి సమక్షంలో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పులపత్తూరు రామసుబ్బారెడ్డి బీజేపీ కండువా కప్పుకున్నట్లు తెలిపారు. దీంతో వైసీపీకి గట్టి దెబ్బ తగలనుందని వారి అనుచరులు చర్చించుకుంటున్నారు.

కోదండరామునికి గోటి తలంబ్రాలు సమర్పణ

ఒంటిమిట్ట, మార్చి 30: కోదండరాముని కల్యాణానికి కృష్ణాజిల్లా పెద్దకొండూరు గ్రామస్తులు శనివారం సాయంత్రం గోటి తలంబ్రాలను సమర్పించారు. రామాలయంలో గ్రామస్తులతో కలిసి రామనామ స్మరణతో మూలవిరాట్ అయిన సీతారామలక్ష్మణులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి సహకరించండి

● మున్సిపల్ కమిషనర్ వాసుబాబు



దుకాణదారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

రాయచోటిటౌన్, మార్చి 30: సకాలంలో ఇంటి పన్నులు, నీటి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు పట్టణ ప్రజలకు సూచించారు. శనివారం ఆయన మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఇంటి పన్నుల వసూళ్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ప్రజలు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఇంటి, నీటి, ఖాళీజాగా పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. అలాగే అధిక బకాయిలు ఉన్న ఇంటి, దుకాణ యజమానులతో ఆయన మాట్లాడారు. అధిక బకాయిదారులు వడ్డీ మినహాయింపుతో చెల్లించేందుకు రేపు ఒక్క దినం మాత్రమే అవకాశం ఉందని, ఏప్రిల్ 1 నుంచి వడ్డీతో సహా చెల్లించాల్సి వస్తుందని వివరించారు. వడ్డీ లేకుండా ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ పన్నులు మార్చి 31వ తేదీలోపు చెల్లించాలన్నారు. అయితే పట్టణ ప్రజల సౌకర్యార్థం 31వ తేది ఆదివారం అయినప్పటికీ మున్సిపాలిటీ కార్యాలయంతో పాటు అన్ని సచివాలయాల్లో పన్నుల వసూళ్ల కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఇంటి పన్నుల వసూళ్లలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి మాసూంబాషా, జూనియర్ అసిస్టెంట్ సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి

● రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు



కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ప్రసాద్‌బాబు

సుండుపల్లె, మార్చి 30: తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. శనివారం మండలంలోని పొలిమేరపల్లె గ్రామ పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి సుమారు 50 కుటుంబాలు చేరారు. ఈ సందర్భంగా వారిని టీడీపీ కండువా కప్పి రాయచోటిలో టీడీపీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అలుపెరగని పోరాటం చేస్తున్నారని, ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. రెడ్డిశేఖర్‌రాజు, మహేశ్, ఖాదర్‌వలి, శ్రీనివాసులు, అశోక్‌రాజు, రవి, రాజశేఖర్, చంద్రశేఖర్, నాగయ్య, వెంకట్రమణ, సురేశ్, కృష్ణయ్య, రెడ్డిరామరాజు, శ్రీకాంత్, రాంప్రసాద్‌రెడ్డితో పాటు మరి కొంత మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్లు తెలియపరిచారు.

ఎన్నికల నిబంధనలను పాటించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ బాబు

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 30: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉన్నందున వాహనదారులు ఎన్నికల నిబంధనలను పాటించాలని రైల్వేకోడూరు సీఐ టి.బాబు తెలిపారు. శనివారం మండలంలోని శెట్టిగుంట పంచాయతీ బాలపల్లె చెక్‌పోస్ట్ వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాల్లో వెళ్లే ప్రయాణికులు తమ వద్ద ఉన్న నగదుకు తప్పనిసరిగా రశీదులు తీసుకెళ్లాలని సూచించారు. రూ.50 వేల కంటే ఎక్కువ ఉంటే తప్పనిసరిగా రశీదులు ఉండాలని పేర్కొన్నారు. వాహనాల్లో మద్యం తరలిస్తే వాహనాలను జప్తు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు తమ వాహన పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి విజయం



రాయచోటి బార్ అసోసియేషన్ నేతలు

రాయచోటిటౌన్, మార్చి 30: ఉత్కంఠ భరితంగా శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన రాయచోటి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది ఎస్.ప్రభాకర్‌రెడ్డి రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయం సాధించారు. ఏపీ బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు శనివారం రాయచోటి బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా రాయచోటి బార్ అసోసియేషన్‌లో 81 మంది ఓటు హక్కు కలిగి ఉండగా అందులో ఎస్.ప్రభాకర్‌రెడ్డికి 47 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థి కె.రవిశంకర్‌కు 33 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో ఎస్.ప్రభాకర్‌రెడ్డి 14 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అలాగే ట్రెజరర్‌గా సిద్ధయ్య ఎంపికయ్యారు. అంతకు మునుపు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పి.రెడ్డెయ్య, సహాయ కార్యదర్శిగా డి.నాగమునిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో రాయచోటి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శి సహాయ కార్యదర్శి, కోశాధికారులుగా ఎన్నికైన సభ్యులను అభినందించారు.

టీడీపీ శ్రేణులపై బైండోవర్ దారుణం

చిట్వేలి, మార్చి 30: బైండోవర్ పేరుతో టీడీపీ శ్రేణులపై కేసులు పెట్టడం దారుణమని టీడీపీ మండల అధ్యక్షుడు కె.కె.చౌదరి అన్నారు. ఆయన శనివారం పోలీసుస్టేషన్‌లో ఉన్న టీడీపీ శ్రేణులను కలిసి మాట్లాడారు. అనంతరం కేసులకు సంబంధించి ఎస్ఐ సుధాకర్‌తో చరవాణిలో మాట్లాడారు. ఈ సందర్భంగా కె.కె.చౌదరి మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండలంలో గతంలో ఎలాంటి వివాదాలకు తావులేని టీడీపీ శ్రేణులపై కావాలనే బైండోవర్ కేసులు పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల లీగల్ సెల్ అడ్వైజర్ నాయుని బాలాజీ, మండల టీడీపీ వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్ రాజు, రాజంపేట పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి బాలకృష్ణ యాదవ్, మైనార్టీ మండల అధ్యక్షుడు కరీంబాషా, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గుండాలయ్య యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి ఈశ్వరయ్య, మైలపల్లి పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు రవీంద్రరాజు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత శిక్షణా తరగతులు

రాజంపేట, మార్చి 30: రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1వ తేది నుంచి ప్రభుత్వ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో చేరబోవు వారికి ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సుజాత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 27న 2024 పాలిసెట్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని, ఇందుకు సంబంధించిన ఏప్రిల్ 5వ తేదీలోపు ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులచే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు.

పాలేటమ్మ తిరుణాల మహోత్సవం

చిన్నమండెం, మార్చి 30: మండలంలోని దిగువగొట్టివీడు గ్రామ పంచాయతీ పాలేటమ్మ జాతర మహోత్సవం శనివారం కన్నుల పండుగగా సాగిందని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యాలు సమర్పిస్తారని, అనంతరం బోనాలు సమర్పిస్తారన్నారు. శనివారం రాత్రి మొక్కుబడులు ఉన్న వారు చాందినీ బండ్లు కట్టి అమ్మవారి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశాల్లో విశ్వం విద్యార్థుల హవా



సైనిక్ స్కూల్లో ప్రవేశాలు సాధించిన విశ్వం విద్యార్థినులు

తిరుపతి(విద్య), మార్చి 30: బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశాల్లో విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విశ్వం విద్యా సంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు శనివారం విడుదయలయ్యాయని, విశ్వంలో శిక్షణ పొందిన వంశితశ్రీ, మనోజ్ఞబాయి, సోనిక, దర్శిణిశ్రీ, నిత్యశ్రీ, వర్షిణి సైనిక్ స్కూల్ ప్రవేశం సాధించారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో అత్యధిక మార్కులు, ఉత్తమ ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎన్.తులసి విశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి అభినందించారు.

కారు ఢీకొని మహిళ దుర్మరణం

పూతలపట్టు, మార్చి 30: కారు ఢీకొని ఓ మహిళ దుర్మరణం చెందారు. పూతలపట్టు మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన కృష్ణయ్య శెట్టి భార్య చిన్నమ్మ (60) శనివారం రాత్రి బీజీ మిట్టూరు వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞానికి బయల్దేరారు. తమ స్వగ్రామం సమీపంలో రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు పూతలపట్టు సీఐ సుదర్శన ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహన తనిఖీల్లో రూ.20లక్షల స్వాధీనం

ఆధారాలు చూపటంతో తిరిగిచ్చేసిన పోలీసులు

చౌడేపల్లె, మార్చి 30: బోయకొండ ఆర్చి వద్ద శనివారం రాత్రి వాహనాల తనిఖీలను తన సిబ్బందితో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా ఓ కారులో రూ.20లక్షలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఇండియా-1 ఏటీఎంల్లో నగదు పెట్టడానికి తీసుకెళుతున్నట్లు ఆధారాలను వాహనంలోని వారు చూపారు. ఈ విషయాన్ని ఆర్వోకు చెప్పటంతో ఆయన ఆదేశాలతో తిరిగి వారికి నగదు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి సెంట్రల్, మార్చి 30 : తిరుపతి విద్యుత్ సర్కిల్ (చిత్తూరు జిల్లా) పరిధిలోని వినియోగదారులు ఆదివారం కూడా బిల్లులు చెల్లించే సదుపాయం కల్పించామని సర్కిల్ ఈఈ ఎం.కృష్ణారెడ్డి తెలిపారు. సర్కిల్ పరిధిలో ఉన్న తమ రెవెన్యూ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సిబ్బంది పనిచేస్తారని పేర్కొన్నారు.

3న స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 30: పద్మావతి యూనివర్సిటీ బీఎడ్, బీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఏప్రిల్ 3వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఎడ్యుకేషన్ విభాగంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఈ అడ్మిషన్లు చేపడతారు. సమగ్ర వివరాల కోసం 944164594లో సంప్రదించవచ్చునని పీఆర్వో డాక్టర్ శ్రీరజని తెలిపారు.

9న తిరుమలలో ఉగాది ఆస్థానం

తిరుమల, మార్చి30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 9వ తేదీన శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఉదయం 3 గంటలకు సుప్రభాతం నిర్వహించి, తర్వాత శుద్ధి నిర్వహిస్తారు. 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, విశ్వక్సేనుల స్వామికి విశేష సమర్పణ చేస్తారు. 7 నుంచి 9 గంటల వరకు విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశిస్తారు. తర్వాత శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు ధరింపజేస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం చేస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద అర్చకులు, ఆగమపండితులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉగాదిని పురస్కరించుకుని అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది.

ఎస్వీయూలో 18 మంది ఉద్యోగులకు మెమోల జారీ

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫలితం

3వ తేదీలోపు వివరణ ఇవ్వాలని వీసీ ఆదేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 30: ఎస్వీ యూనివర్సిటీలోని పరీక్షల విభాగానికి చెందిన 18 మంది ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. మార్చి 28వ తేదీ పరీక్షల విభాగంలోని పలు సెక్షన్లను వీసీ శ్రీకాంత్ రెడ్డి తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆయా సెక్షన్లకు సంబంధించిన ఎక్కువ మంది అధికారులు, ఉద్యోగులు విధుల్లో లేని విషయాన్ని గుర్తించారు. వారు ఆ సమయంలో ఎందుకు విధులకు హాజరు కాలేదో రాత పూర్వకంగా వివరణ ఇవ్వాలని కోరారు. ఏప్రిల్ 3వ తేదీలోపు వివరణ ఇవ్వాలని సూచించారు. వివరణను అనుసరించి తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. విధి నిర్వహణ సమయంలో సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల వీసీ సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. సర్టిఫికెట్ల కోసం వచ్చే విద్యార్థులకు సకాలంలో పనులు చేయకుండా ఉద్దేశ పూర్వకంగానే కొందరు ఉద్యోగులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే పరీక్షల విభాగం పరిధిలోని బీ-9, బీ-5, బీ-6, బీ-4, తదితర విభాగాలను వీసీ తనిఖీ చేసినట్టు తెలుస్తోంది.


గుడిపాల మండలం బసవాపల్లెలోని పంచాయతీ కార్యాలయం - పెనుమూరు మండలం సీఎస్ అగ్రహారం, మొరవకండ్రిగ, గొల్లపల్లెలోని వాటర్ ట్యాంకులు

వైసీపీ రంగులు మార్చేదెప్పుడు?

గుడిపాల/పెనుమూరు, మార్చి 30: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 14 రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వ కార్యాలయాలకు, వాటర్ ట్యాంకులకు వైసీపీ రంగులు మాత్రం మార్చడం లేదని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. గుడిపాల మండలంలోని బసవాపల్లె పంచాయతీ కార్యాలయానికి ముందు భాగంగా తెల్ల రంగు వేసి, వెనుక భాగంలో వైసీపీ రంగులు అలాగే ఉంచేశారు. అలాగే పెనుమూరు మండలంలో చార్వాగానిపల్లి సచివాలయ పరిధిలోని సీఎస్ అగ్రహారంలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకుకు, కలికిరి పంచాయతీ గొల్లపల్లి, మొరవకండ్రిగ పాఠశాల వద్ద కూడా వైసీపీ రంగులతో వాటర్ ట్యాంకులు ఉన్నాయి.

తిరుమల ఘాట్‌లో ప్రమాదం

చెట్టును ఢీకొన్న కారు : బెంగళూరు భక్తురాలి మృతి


తిరుపతి బర్డ్ ఆస్పత్రికి మురళీధర్ తరలింపు
భవాని మృతదేహం


ప్రమాదానికి గురైన కారు

తిరుమల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ భక్తురాలు మృతి చెందింది. మరో భక్తుడికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురు పిల్లలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బెంగళూరుకు చెందిన మురళీధర్, భవాని దంపతులు పదిమంది కుటుంబ సభ్యులతో మూడు కార్లలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. శనివారం సాయంత్రం 6 గంటలకు తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.మురళీధర్, భవానీ,వారి ఇద్దరు పిల్లలు ప్రజ్వల్, నిసర,మురళీధర్ అన్న కుమార్తె రక్షితతో కలిసి సాంత్రో కారులో తిరుమల నుంచి బయలుదేరారు. ఏనుగుల ఆర్చి దాటిన తర్వాత కారు అదుపు తప్పి ఎడమవైపున్న అడవిలోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొంది. వెనుకవస్తున్న కుటుంబ సభ్యులు, ఇతర ప్రయాణికులు, ప్రమాదానికి గురైన కారులోని మురళీధర్ దంపతులను, పిల్లలను వెలుపలకు తీసుకువచ్చారు. అంబులెన్స్ ద్వారా తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తీసుకురాగా, వైద్యులు పరిశీలించి భవాని అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. కారు ముందు సీట్లో ఉన్న భవాని తల గట్టిగా డ్యాష్‌బోర్డుకు కొట్టుకోవడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు వైద్యులు అభిప్రాయపడ్డారు.పిల్లలు స్వల్పగాయాలతో బయటపడగా, డ్రైవింగ్ చేస్తున్న మురళీధర్ తీవ్రంగా గాయపడ్డారు.టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఆస్పత్రికి చేరుకుని మెరుగైన చికిత్స కోసం మురళీధర్‌ను తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి తరలించారు. నిద్రమత్తే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భద్రతా సిబ్బంది అనుమానం వ్యక్తపరుస్తున్నారు.

వెక్కివెక్కి ఏడ్చిన చిన్నారులు

తల్లి మృతదేహం ఒకవైపు, శరీరం మొత్తం రక్తగాయాలై ఎలాంటి కదలికలు లేకుండా పడివున్న తండ్రిని చూసి వారి ఇద్దరు చిన్నారులు వెక్కివెక్కి ఏడ్చారు. 'పైకి లే అమ్మా.. మాట్లాడమ్మా' అంటూ కన్నీరుమున్నీరయ్యారు.దైవదర్శనం కోసం వస్తే ఇలా జరిగిందేంటీ స్వామీ అంటూ కుటుంబ సభ్యులు కూడా రోదించడంతో ఆస్పత్రి ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి.


భవాని మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సమర్థంగా విధుల నిర్వహణకు వర్క్‌షాప్‌లు అవసరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు - హాజరైన ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయమూర్తులు


చిత్తూరు కలెక్టరేట్, మార్చి 30: న్యాయమూర్తులు సమర్థంగా విధులు నిర్వహించేందుకు వర్క్‌షాప్‌లు అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో హైకోర్టు ప్రత్యేక కమిటీ ఆదేశాల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయమూర్తులకు సివిల్ సూట్స్- అవలోకనం అంశాలపై ఒక్క రోజు వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇలాంటి వర్క్‌షాప్‌లు నాలుగు విడతలుగా నిర్వహిస్తామని ప్రకటించారు. మాజీ జిల్లా జడ్జిలు జీవీ కృష్ణయ్య, మోహనరావు, రిటైర్డు సివిల్ జడ్జి జేసురత్నకుమార్, తదితరులు న్యాయమూర్తులకు పలు సూచనలు ఇచ్చారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్, పదో అదనపు జిల్లా కోర్టు జడ్జి అన్వర్‌బాష, పోక్సో కోర్టు జడ్జి శాంతి, ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు జడ్జి శ్రీదేవి, న్యాయమూర్తులు వెన్నెల, ఉమాదేవి, మాధవి, శ్రీనివాసమూర్తి, షేక్ బాబాజాన్, కీర్తనలతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అదనపు సీనియర్, జూనియర్ జడ్జిలు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.41 కోట్లు

తిరుమల, మార్చి30(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.41 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది.

త్రిపుర వర్సిటీ వీసీగా నరసింహరాజు

ఎస్వీయూ రిటైర్డు ఆచార్యుడికి అత్యున్నత పదవి


నరసింహరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 30: త్రిపురలోని ఇంటర్నేషనల్ బుద్ధిస్ట్ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఎంపీ నరసింహరాజు (డాక్టర్ ముద్దలూరు పెద్ద నరసింహరాజు) నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు వెలువరించింది. ఉమ్మడి కడప జిల్లా రైల్వే కోడూరు ప్రాంతానికి చెందిన ఆయన ఎస్వీ యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో సుదీర్ఘ కాలం ప్రొఫెసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. సోషియాలజీ హెడ్‌గా, బీఓఎస్ ఛైర్మన్‌గా, ఎస్వీయూ దూరవిద్యా విభాగం డైరెక్టర్‌గా, ఒంగోలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ క్రమంలో త్రిపురలో గల ఇంటర్నేషనల్ బుద్ధిస్ట్ యూనివర్సిటీ వీసీగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో త్రిపుర యూనివర్సిటీ వీసీగా నరసింహరాజు బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఆయన్ను అభినందించారు.

ఇద్దరు రుయా ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ఫలితం

తిరుపతి (వైద్యం), మార్చి 30 : వైద్యం కోసం వచ్చిన రోగికి హెచ్‌ఐవీ అంటూ తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ సూపరింటెండెంట్ రవిప్రభు శనివారం ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదంలో కాలిగి గాయమైన ఓ యువకుడు పది రోజుల కిందట వైద్యం కోసం రుయాస్పత్రికి వచ్చాడు. వైద్యుల సూచన మేరకు రుయాస్పత్రిలోని ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించుకున్నాడు. యువకుడికి హెచ్‌ఐవీ పాజిటివ్ అని తప్పుడు రిపోర్టులు ఇచ్చారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో వార్తలు ప్రచురితం కావడంతో రుయా సూపరింటెండెంట్ రవిప్రభు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ల్యాబ్ టెక్నీషియన్ బి.రాజశేఖర్ నాయక్, ల్యాబ్ అటెండరు ఎన్.రమణ మోహన్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. విచారణ కొనసాగుతోందని, పూర్తయ్యే వరకు అందుబాటులో ఉండాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ల్యాబ్‌ను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాల్సిన మైక్రోబయాలజీ విభాగాధిపతి, డాక్టర్లను తప్పించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. సాధారణంగా ల్యాబ్ నుంచి వచ్చే ప్రతి రిపోర్టును ల్యాబ్ విభాగాధిపతి లేదా సంబంధిత డాక్టర్లు పరిశీలించిన తర్వాతనే రోగులకు అందించాలి.

వైసీపీ ప్రచార సామగ్రి నిల్వపై ఫిర్యాదు

గోదాముల నిర్వాహకులు నలుగురిపై కేసు

రేణిగుంట, మార్చి 30 : వైసీపీ ప్రచార సామగ్రి భారీ ఎత్తున నిల్వ చేసిన మూడు గోదాముల నిర్వాహకులు నలుగురిపై కేసు నమోదయ్యింది.రేణిగుంట మండలం పాత విమా నాశ్రయ రోడ్డులోని మూడు గోదాముల్లో పెద్ద ఎత్తున వైసీపీ ప్రచార, ప్రభావిత సామగ్రి మూడురోజుల క్రితం బయటపడిన విషయం తెలిసిందే.టీడీపీ నాయకుల ఆందోళనతో ప్రచార సామగ్రిని సీజ్ చేసిన అధికారులు శుక్రవారం కలెక్టర్ అనుమతితో తరలించడానికి అనుమతించారు. కాగా వైసీపీ ప్రచార, ప్రభావిత సామాగ్రిని భద్రపరచిన గోదాముల నిర్వాహకులపై రేణిగుంట ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సలోమి శనివారం గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ప్రచార సామగ్రిని కొనుగోలు చేసిన సుమన్, గోడౌన్‌లో ప్రచార సామగ్రి ఇన్‌ఛార్జులు అనిల్, రమేష్‌రెడ్డి, గోదాము ఇన్‌ఛార్జి రవికుమార్‌పై 188వ సెక్షన్ కింద కేసు నమోదు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సుబ్బారాయుడు తెలిపారు. అలాగే రేణిగుంట అర్బన్ పోలీసు స్టేషన్లో కూడా గోదాముల నిర్వాహకులు సుమన్,ప్రచార సామగ్రి ఇన్‌ఛార్జులు అనిల్, రమేష్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు.

అసలీ ఎమ్మెల్వో ఎవరు?

వలంటీర్లను రాజీనామా చేయమనడంపై విచారణ

వరదయ్యపాళెం, మార్చి 30:రాజీనామా చేసి వైసీపీ తరఫున ప్రచారంలో పాల్గొనండి...పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చాక మిమ్మల్నే విధుల్లోకి తీసుకుంటాం అంటూ వలంటీర్లపై ఒక మండల లెవల్ ఆర్గనైజర్ (ఎమ్మెల్వో) ఒత్తిడి చేయడంపై శనివారం పత్రికల్లో వెలువడిన కథనాలు వరదయ్యపాళెం మండలంలో కలకలం రేపాయి. అసలు ఈ ఎమ్మెల్వో చంద్ర ఎవరనే విషయంపై చర్చ నడిచింది. పత్రికా కథనాలపై ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అధికారి చిరంజీవి స్పందించి ఆ వలంటీర్లు పనిచేసే సచివాలయ అధికారి బసిరెడ్డికి విచారణ జరపాలని నోటీసు పంపారు.వలంటీర్లను పిలిపించి బసిరెడ్డి వివరణ కోరగా ప్రతి పథకం అమలు చేసే సమయంలో ఎమ్మెల్వో చంద్ర పెట్టే గ్రూప్ మీటింగుల మాదిరిగానే ఈ నెల 28వ తేదీ సాయంత్రం 6గంటల సమయంలో ఫోన్ చేసి డేటా అడగ్గా కొంతమంది స్పందించి వివరాలు చెప్పామన్నారు. ఎప్పుడూ జరిగే కార్యక్రమమే కదా అని స్పందించామంటూ వలంటీర్లు వివరణ ఇచ్చారు. ఈ సమాచారాన్ని ఇన్‌ఛార్జి ఎంపీడీవో అనసూయకు,ఎంసీసీ అధికారి చిరంజీవికి కార్యదర్శి బసిరెడ్డి తెలిపారు.వారు ఆ నివేదికను తిరుపతి డీఎల్డీవో, జీఎస్ డబ్ల్యూ కార్యాలయ అధికారులకు పంపించారు. అసలు ఈ ఎమ్మెల్వో చంద్ర ఎవరు? ఆయన్ను ఎవరు నియమించారు? ఎక్కడ ఉంటారు? తెలుసుకుని కేసు నమోదు చేయిస్తామని చిరంజీవి, అనసూయ తెలిపారు.

టెన్త్ సంస్కృతం పరీక్షకు 685 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 30: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా చివరి రోజైన శనివారం సంస్కృతం పేపర్-2 పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 702 మంది విద్యార్థులకు గాను 685 మంది హాజరవగా, 17 మంది గైర్హాజరైనట్లు డీఈవో దేవరాజు, పరీక్షల సహాయ కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు.

శివ శివా..

రేణిగుంట పూర్వ తహసీల్దారు శివప్రసాద్‌పై ఫిర్యాదులెన్నో

ప్రభుత్వ భూముల పరాధీనం ● తీవ్ర అవినీతి ఆరోపణలు ● ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ తనిఖీలు

తిరుపతి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, శ్రీకాళహస్తి పరిసరాల్లో అత్యంత విలువైన ప్రభుత్వ భూముల పరాధీనం చేయడం.. తీవ్ర అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే రేణిగుంట పూర్వ తహసీల్దారు శివప్రసాద్‌పై ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ దృష్టి సారించింది. ఇన్నాళ్లు ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లినా.. ఓ అధికారితో ఇతడికి ఉన్న దోస్తీ కారణంగా బుట్టదాఖలా అవుతున్నాయని సమాచారం. దీంతో బాధితులు నేరుగా ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడం వల్లే శనివారం ఆ అధికారితో పాటు బంధువులు, బినామీల ఇళ్లల్లో ఏకకాలంలో తొమ్మిది చోట్ల ఏసీబీ సీఐయూ బృందాలు తనిఖీలు చేపట్టాయి.

తండ్రి మరణంతో కారుణ్య నియామకం కింద జూనియర్ అసిస్టెంట్‌గా చేరిన శివప్రసాద్.. స్వల్ప కాలంలోనే రూ.కోట్లకు పడగలెత్తారని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఆర్ఐగా పదోన్నతిపై తిరుపతి ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఆయన.. ఓ ఆర్డీవో సహకారంతో ప్రొటోకాల్ డీటీగా వ్యవహరించారని తెలిసింది. ఆ సమయంలోనే ఉన్నత స్థాయి వ్యక్తులతో పరిచయాలు పెంచుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత తిరుపతి రూరల్ తహసీల్దారు కార్యాలయలో సీనియర్ అసిస్టెంట్‌గా, అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో ప్రొటోకాల్ డీటీగా పనిచేశారు. ఆయా సందర్భాలలో ఉన్నతాధికారులతో పెరిగిన పరిచయాలతో రేణిగుంట డీటీగా బదిలీ అయి.. అక్కడే పాతుకుపోయారు. అక్కడ తహసీల్దారును డమ్మీని చేసి డీటీగా ఉన్న శివప్రసాదే అధికారం చెలాయించారన్న విమర్శలున్నాయి. విమానాశ్రయం అనుకుని ఉన్న పాతిక ఎకరాల ప్రభుత్వ భూమికి వైసీపీకి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి అండతో ఇతరుల పేరిట పట్టాలు జారీ చేశారని.. దాని కోసం ఎకరాకు రూ.20 లక్షల నుంచీ రూ.30 లక్షల దాకా వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ఆ తర్వాత తహసీల్దారుగా పదోన్నతి రావడంతో రేణిగుంటలోనే కొనసాగారు. ఆ సమయంలో రూ.కోట్ల విలువచేసే ప్రభుత్వ బంజరు, పోరంబోకు, అనాధీనం భూములను అనర్హులకు కట్టబెట్టడం, అధికార పార్టీ ముఖ్యనేత కబ్జాలకు సహకరించారన్న ఆరోపణలున్నాయి. తిరుపతి రూరల్, అర్బన్, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో చెరువులు, కాలువలకు కూడా ఎన్వోసీలు జారీ కావడం.. ప్రభుత్వ భూముల పరాధీనం, భూముల సెటిల్‌మెంట్లతో అక్రమార్జన వందల కోట్లకు చేరుకుందని సహోద్యోగులే చెబుతున్నారు.

కలెక్టర్‌కు సరెండర్ చేసినా..!

గతంలో ఇతడిపై వచ్చిన ఆరోపణలపై ఓ కలెక్టర్ విచారణ జరిపించి 40 అంశాలను నిర్ధారిస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని సమాచారం. ఇటీవల సీసీఎల్ఏ కూడా పలు అంశాల్లో ఇతడిని బాధ్యుడిగా గుర్తించి రేణిగుంట నుంచి కలెక్టర్‌కు సరెండర్ చేసిన సంగతి తెలిసిందే. తీవ్రస్థాయి రాజకీయ ఒత్తిళ్లతో ఇతడిని కలెక్టరేట్‌లో కాకుండా ఏర్పేడు మండలానికి బదిలీ చేశారు. అక్రమార్జన.. నేతల అండ చూసుకుని కలెక్టర్లను కూడా ఖాతరు చేసేవారు కాదన్న ప్రచారం ఉంది. ప్రభుత్వానికి ఎన్ని నివేదికలు ఇచ్చినా, చర్యలకు సిఫారసు చేసినా డబ్బు, పలుకుబడితో అధిగమించేవారని చెబుతున్నారు. గతంలోనూ ఏసీబీకి పలు ఫిర్యాదులు వెళ్లినా.. ఓ అధికారితో స్నేహం వల్ల తనిఖీలు, దాడులు జరగుకకండా జాగ్రత్త వహించేవారని అంటున్నారు. సంబంధిత ఏసీబీ అధికారితో కలసి బెంగళూరు వంటి నగరాల్లో భారీ పెట్టుబడులు కూడా పెట్టినట్టు ఆరోపణలున్నాయి.

రంగంలోకి ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్

తాజాగా శివప్రసాద్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు రావడంతో ఏసీబీకి కాకుండా ఆ విభాగంలోని సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్‌కు విచారణ బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. విజయవాడ నుంచే మొత్తం 42 మందితో కూడిన బృందాలు ఏకకాలంలో దాడులు జరిగాయి. కాగా, తనకు స్నేహమున్న ఏసీబీ అధికారి సూచన మేరకు మొత్తం అక్రమార్జనంతా బినామీల పేరిట పెట్టినట్టు చెబుతున్నారు. ఇప్పటికే గుర్తించిన పలువురు బినామీల బ్యాంకు ఖాతాలు, లాకర్లను తనిఖీ చేయనున్నట్టు సమాచారం.

ఇంతకాలం అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలు ఇతడిని వెనకేసుకొచ్చి, అన్నింటికీ అండదండలిచ్చిన క్రమంలో ఈ దాడులు అందరినీ విస్మయానికి గురి చేస్తున్నాయి. బహుశా, శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన నేతకు తెలియకుండా విలువైన భూముల విషయంలో ఎవరికైనా సహకరించి భారీగా లబ్ధి పొంది ఉంటారని, ఉంటారని, అది ఆలస్యంగా తెలియడం వల్లే ఆ నేతే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈ చర్యలకు కారకులై ఉంటారన్న ప్రచారం జరుగుతోంది. గతంలో పలువురు అధికారులను వేధించిన చరిత్ర ఆ నేతకు ఉండటంతో దీన్ని కొట్టిపారేయలేమంటున్నారు. కారణాలేవైనా ఎప్పుడో జరగాల్సిన ఏసీబీ తనిఖీలు, చర్యలు ఆలస్యంగానైనా మొదలు కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బంగారుపాళ్యంలో ఏసీబీ తనిఖీలు



బంగారుపాళ్యం మండలం గుర్రంకొండ్లవూరులోని తహసీల్దారు శివప్రసాద్ మామ నాగులయ్య ఇంట్లో శనివారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. పలు రికార్డులు, బ్యాంకు పుస్తకాలు, భూ రికార్డులను పరిశీలించారు. బ్యాంకు పుస్తకాన్ని తీసుకెళ్లినట్లు సమాచారం.

- బంగారుపాళ్యం

ఏసీబీ చేతికి చిక్కిన వీఆర్వో

- ముృటేషన్ ఆమోదం కోసం లంచం డిమాండ్ చేసిన వైనం
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు


వీఆర్వో యల్లయ్య

పీలేరు, మార్చి 30: కేవీపల్లె మండలంలో ఓ రైతుకు సంబంధించిన మ్యుటేషన్ వ్యవహారంలో లంచం తీసుకుంటూ ఉండిన ఓ వీఆర్వోను ఏసీబీ అధికారులు శనివారం వలపన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ కడప డీఎస్పీ గిరిధర్ కథనం మేరకు కేవీపల్లె మండలం గోరంట్లపల్లె పంచాయతీ బసిరెడ్డిగారిపల్లె వడ్డిపల్లెకు చెందిన రైతు మల్లయ్య భూమికి సంబంధించిన రికార్డుల్లో తప్పులు దొర్లాయి. వాటిని సరిదిద్దేందుకు మల్లయ్య గత నెలలో మ్యుటేషన్ దరఖాస్తు చేసుకున్నాడు. ఆయన భూమి అదే గ్రామానికి చెందిన మూడు సర్వే నెంబర్లలో ఉండడం, వాటిలో రెండు సర్వే నెంబర్లలో ఆయన భూమి దరఖాస్తు పట్టాగా నమోదు కావడంతో దానిని మార్చేందుకు మ్యుటేషన్ దరఖాస్తు చేసుకున్నాడు. మ్యుటేషన్‌ను ఆమోదించేందుకు సొరకాయలపేట గ్రామ సచివాలయ వీఆర్వో యల్లయ్య, రైతు మల్లయ్య వద్ద రూ.9 వేలు లంచం డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని యల్లయ్య పలుమార్లు ప్రాధేయపడగా రూ.5 వేలుకు ఒప్పుకున్నాడు. వీఆర్వో వ్యవహారంతో విసిగిపోయిన మల్లయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు ఆ సొమ్ము చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని మల్లయ్య వీఆర్వోకు తెలుపగా శనివారం సచివాలయం వద్దకు రమ్మన్నాడు. సచివాలయంలో అతను లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రైతు మల్లయ్య చెల్లించిన సొమ్ముతో అతను దొరికిపోయాడు. దీంతో ఆ సొమ్ముతో పాటు రైతు మల్లయ్యకు సంబంధించిన ఫైల్స్‌ను స్వాధీనం చేసుకుని వీఆర్వో యల్లయ్యను రిమాండు నిమిత్తం నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు మహమ్మద్ అలీ, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య


అరుణ్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

వాల్మీకిపురం, మార్చి 30: రైలు కిందపడి అరుణ్‌కుమార్(22) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వాల్మీకిపురం పట్టణ సమీపంలో చోటుచేసుకుంది. పట్టణ సమీపంలోని పునుగుపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు అరుణ్‌కుమా ర్ గ్రామ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కదిరి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు.

మద్యం తరలిస్తున్న ఏడుగురు అరెస్టు

మదనపల్లె టౌన్, మార్చి 30: మదనపల్లె ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం,నాటు సారా తరలిస్తున్న ఏడుగురిని ఎస్‌ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి అరెస్టు చేసి రిమాండుకు పంపారు. బి.కొత్తకోట మండల బాలసానిపల్లె వద్ద ఎం.బాబు(40) ఇంటి వెనుక పెరట్లో అక్రమంగా దాచివుంచిన 261 కర్ణాటక టెట్రా ప్యాకెట్ల మద్యంను సీజ్ చేసి అరెస్టు చేశారు. అలాగే కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు నుంచి జి. సుబ్రమణ్యం అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో 302 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం తీసుకొచ్చి మదనపల్లె మండలం రేగంటివారిపల్లెకు చెందిన సీహెచ్ రమేశ్(33), సీటీఎంకు చెదిన షికారి చందు(23)ల ఆటోలో మార్పిడి చేస్తుండగా అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ద్విచక్ర వాహనం, ఆటో సీజ్ చేశారు. కురబలకోట మండలం ముదివేడు వద్ద డీటీఎఫ్ ఎస్‌ఐ హేమకుమార్ తనిఖీల్లో తంబళ్లపల్లె మండలం మాదిగపల్లెకు చెందిన ఎ.బాబు(52)ను అరెస్టు చేసి 20 లీటర్ల నాటుసారా సీజ్ చేశారు. అలాగే కోటారుపల్లె తాండాకు చెందిన మునిరెడ్డినాయక్ భార్య బి.నిర్మల(25) వద్ద 15 లీటర్ల నాటుసారా సీజ్ చేసి అరెస్టుచేశారు. వలసపల్లె గ్రామం వద్ద నరసింహులు నాయక్ భార్య సుజాత(37) వద్ద 25లీటర్ల నాటుసారా సీజ్ చేసి అరెస్టు చేశారు. మొత్తం ఏడుగురు నిందితులను అరెస్టు చూపి రిమాండు నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి తెలిపారు.

సరిహద్దు చెక్‌పోస్టులో తనిఖీలు

పెద్దతిప్పసముద్రం మార్చి 30 : ఎన్నికలు నేపథ్యంలో కర్ణాటక సరిహద్దు చెక్ పోస్టులను శనివారం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో వి. శ్రీనివాస్ తనిఖీ చేశారు. అంకాల మడుగు చెక్‌పోస్టును మొలకలచెరువు ఎస్‌ఈబీ సీఐ రామ్మోహన్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు సిబ్బందితో ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా డబ్బులు, మద్యం లాంటివి తరలించకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు., కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో మద్యం, డబ్బులు తరలిస్తూ పట్టుబడితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారాన్ని చేరవేసి వారికి అప్పచెప్పాలని సూచించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

వాల్మీకిపురం ప్రజల రుణం తీర్చుకుంటా..

- మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు ఉమ్మడి కూటమి బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి
- మొదటిసారి జిల్లాకు విచ్చేసిన ఆయనకు బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తల ఘనస్వాగతం


మదనపల్లెలో కిరణ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం


వాల్మీకిపురంలో కూటమి పార్టీశ్రేణుల ఘనస్వాగతం

మదనపల్లె/వాల్మీకిపురం, మార్చి 30: తన తండ్రి నల్లారి అమరనాథ రెడ్డి కాలం నుంచి నేటి వరకు వాల్మీకిపురం ప్రజలు ఆదరిస్తున్న తీరు ఎన్నటికీ మరువలేనిదని వారి రుణం తీర్చుకుంటానని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల చివరి సీఎం, ప్రస్తుత కూటమి బీజేపీ రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మదనపల్లె నుంచి కలికిరికి విచ్చేసిన సందర్భంగా వాల్మీకిపురంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. స్థానిక గాంధీ బస్టాండ్ ప్రాంతం వద్దకు చేరుకున్న నల్లారి కిరణ్‌కు స్థానిక నేతలు, మహిళలు మంగళ హారతులు పడుతూ నినాదాలతో హోరెత్తించారు. మళ్లీ నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని, ప్రతి గడపకు వచ్చి ఆదరిస్తున్న ప్రజలందరినీ కలుస్తానన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్‌నాయుడు, నాయకులు గాంధీపేట రమణ, సుధాకర్‌రెడ్డి, పీవీ నారాయణ, కువైట్ బాబు, సయ్యద్‌బాషా, చాను, ఆదినారాయణ, ఫణి, లోకేష్, అడ్వకేట్ రమణ, స్వర్ణలత, టీడీపీ సీనియర్ నాయకుడు కువైట్ బాబుతోపాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన స్వగ్రామానికి విచ్చేస్తున్న కిరణ్ కుమార్‌రెడ్డికి ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు వద్ద రాజంపేట పార్లమెం టు పరిధిలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు, రాజంపేట, రైల్వేకోడూరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మూడుపార్టీల నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మదనపల్లె మండలంలోని చీకలబైలు చెక్‌పోస్టు వద్దకు భారీగా చేరుకుని గజమాల, పూలమాలు వేసి ఘనంగా సత్కరించారు. కోలాటాలు, చెక్కభజనలు, పిల్లనగ్రోవి వాయిద్యాలు, లంబాడినృత్యాలతో స్వాగతం పలికారు. బార్డర్‌కు కిలోమీటరు దూరంలోనే కాన్వాయ్ వాహనం దిగిన కిరణ్‌కుమార్‌రెడ్డి అభిమానుల మధ్య నడుచుకుంటూ ముందుకు కదిలారు. ఈ క్రమంలో చీకలబైలు నుంచి రాష్ట్ర సరిహద్దు వర కూ రెండుకిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరడంతో గంటపాటు ట్రాఫిక్‌కు తీవ్రఅంతరాయం ఏర్పడింది. ఈ ముసుగులో కర్ణాటక మద్యం, డబ్బులూ తరలించేందుకు అవకాశం ఏర్పడింది. మదనపల్లె మండలం గంగన్నగారిపల్లెకు చెందిన టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు, జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్ చౌదరి, టీడీపీ నియోజకవర్గ నేత రాటకొండ బాబురెడ్డిలు పార్టీశ్రేణులు, బీజేపీ రాజంపేట జిల్లా అధ్య క్షుడు సాయి లోకేష్, చల్లపల్లె నరసిం హారెడ్డి, బీజేపీ జిల్లా ఇన్‌ఛార్జి చంద్రమౌళి, పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్, యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, జె.కె.వర్మ, అసెంబ్లీ కన్వీనర్ నిర్మల్, నాగోతు రమేష్‌నాయుడు, పొత్తూరు శ్రీకాంత్, మంగరాజు, మదన్, పులి నరేంద్రకుమార్, తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి, రాటకొండ విష్ణువర్ధన్, భగవాన్, కిరణ్‌కుమార్, జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్, నేతలు ఘనస్వాగతం పలికారు.

కలిసికట్టుగా పనిచేసి కూటమి అభ్యర్థులను గెలిపించండి

కురబలకోట, మార్చి 28: కలిసికట్టుగా పని చేసి కూటమి అభ్యర్థులను గెలిపించండని మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయనను తంబళ్లపల్లెకు చెందిన టీడీపీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో పర్యటించి బీజేపీ, టీడీపీ చేపట్టబోయే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సురేంద్ర యాదవ్, రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ చికిత్సలు అందించకుంటే చర్యలు

మదనపల్లె టౌన్, మార్చి 30: ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రైవేటు ఆస్పత్రులు రోగులకు ఉచితంగా చికిత్సలు అందించాలని, అలా కాకుండా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ చికిత్సలు తీసుకుంటున్న రోగులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ఆస్పత్రుల్లో అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ వివరాలను ఆరోగ్యమిత్రలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులకు ఉచితంగా ఆహారం అందించాలన్నారు. సరైన సేవలు అందించని ప్రైవేటు ఆరోగ్యశ్రీ ఆస్పత్రులపై నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫి, రామతులసి, సిద్దయ్య పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

పెద్దమండ్యం, మార్చి 30: పెద్దమండ్యం మండలం కలిచెర్ల మౌలాకా పహాడ్ వద్ద శనివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. గత నెల 29న కడప పెద్దదర్గా పీఠాధిపతి, మౌలాకా పహాడ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ ఆరిఫుల్లా హుస్సేనీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి తిరుపతి (అరవింద మధురై శాఖ)వారి సహకారంతో 675 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి 24 మందికి కంటి ఆపరేషన్‌లతో పాటు 204 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఉచిత కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి మలి విడత శనివారం మౌలాకా పహాడ్ వద్ద వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. కడప పెద్దదర్గా పీఠాధిపతి, మౌలాకా పహాడ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ సొంత నిధులతో ఉచిత కంటి మందుల పంపిణీ చేసినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు.

ఉచిత పాలిసెట్ కోచింగ్

కలికిరి, మార్చి 30: పాలిసెట్-2024 ప్రవేశ పరీక్షల సందర్భంగా అర్హులైన విద్యార్థుల కోసం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కోచింగ్‌తోపాటు ఉచితంగా అవసరమైన స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తామని చెప్పారు. మోడల్ పరీక్షలు కూడా నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 1 నుంచి 25వ తేదీ వరకూ ఈ కోచింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పదో తరగతి పరీక్షల హాల్ టికెట్టు జిరాక్స్ కాపీ, ఆధార్ కార్డు నకలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, మొబైల్ ఫోను తీసుకురావాలని కోరారు. ఇతర వివరాలకు 95055 04200, 99662 09000 లేదా 98857 73575 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

తంబళ్లపల్లెలో ఐదేళ్లలో అభివృద్ధి లేదు

ములకలచెరువు, మార్చి 30: తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఐదేళ్లలో ఎలాంటి అభివద్ధి జరగలేదని నియోజకవర్గ నేత, పారిశ్రామికవేత్త కొండా నరేంద్ర పేర్కొన్నారు. మండలంలోని దేవళచెరువులో శనివారం పలువురు టీడీపీ నాయకులు, మద్దతుదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేచి చూద్దాం..ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుందామని చెప్పారు. సమావేశంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జులు నారాయణస్వామి నాయుడు, సుబ్బినాయుడు, సుధాకర్‌నాయుడు, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి సుదర్శన్, మాజీ సర్పంచ్ శ్రీని వాసులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బసివి శ్రీనివాసులు, నేతలు బసివి చంద్ర, పెద్దరెడ్డెప్ప, రవణప్ప, మ స్తాన్, సుబ్బన్న, శివారెడ్డి, సోమశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

ఎనర్జీక్లబ్ ఏర్పాటు

మదనపల్లె అర్బన్, మార్చి 30: స్థానిక బాపూజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎనర్జీక్లబ్‌ను పాఠశాల హెచ్‌ఎం రఘు, సీనియర్ ఉపాధ్యాయుడు మురళీమోహన్ ప్రారంభించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిం చారు. పాఠశాల ఉపాధ్యాయులు జాకీర్‌హుసేన్, వాణీ ,సౌజన్య, హిమబిందు పాల్గొన్నారు.

మడికయ్యులలో శతచండీ హోమం

మదనపల్లె అర్బన్, మార్చి 30: చిప్పిలి గ్రామంలోని మడికయ్యుల శివాలయంలో శనివారం మహాన్యాసపారాయణ శతచండీ పారాయణ హోమం ఆలయ ఈవో రమణ, ప్రధాన అర్చకులు విశ్వేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం, సాయంత్రం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆర్థిక శాస్త్రంతో ఉజ్వల భవిష్యత్

- 40వ రాష్ట్ర స్థాయి సదస్సులో వక్తలు


ఏపీ ఎకనమిక్ 40వ రాష్ట్రస్థాయి సదస్సు ప్రారంభిస్తున్న చైర్మన్ మోహన్‌రావు, విద్యావేత్తలు

మదనపల్లె టౌన్, మార్చి 30: నేటి సమాజంలో ఇంజినీరింగ్, సైన్సుతోపాటు ఆర్థికశాస్త్రంతో ఉజ్వల భవిష్యత్ ఉందని ఏఈ ఎకనామిక్ అసోసియేషన్ చైర్మన్ మోహన్‌రావు పేర్కొన్నారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఏపీ ఎకనామిక్ అసోసియేషన్ 40వ రాష్ట్ర సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ పెట్టుబడి, ఉత్పత్తి, మార్కెటింగ్ విక్రయాలు అనే నాలుగు అంశాలు ఆర్థికశాస్త్రం పరిధిలో వస్తాయని వాటిపై డిగ్రీ స్థాయిలోనే విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ హరినారాయణ మాట్లాడుతూ మానవునికి అందుబాటులో వున్న వనరులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఎస్వీయూ మాజీ రిజిస్ట్రార్ దేవరాజులు మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యకు 22నుంచి 25 శాతం బడ్జెట్ కేటాయించాలన్నారు. అనంతరం 50 డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీల నుంచి వచ్చిన ఎకనమిక్స్ ప్రొఫెసర్లు పేపర్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమలో కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, అధ్యాపకులు శివరామయ్య, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



కురబలకోట, మార్చి 30: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పూర్వవిద్యార్థులు శనివారం కలుసుకున్నారు. కళాశాలలో 2004-07లో ఎంసీఏ వరకు విద్యనభ్యసించారు. వీరంతా తాము చదువుకున్న కళాశాలలో తమ కుటుంబ సభ్యులతో కలసి సందడి చేశారు. తాము చదువుకున్న రోజులలో గడిపిన అనుభూతులను గుర్తుచేసుకుంటూ తమ స్నేహితుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అందరూ కలసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలను ముగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నవీన్‌కుమార్,శ్రీదేవీ, గంగిశెట్టి, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దండుమారెమ్మ జాతర

కురబలకోట, మార్చి 30: మండలంలోని ముదివేడులో వెలసిన దండుమారెమ్మ జాతరను శనివారం వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతరకు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించడంతో పాటు చాందినీబండ్లను ఊరేగించారు. రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్ర యాదవ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముదివేడు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కనుమలో గంగమ్మతల్లికి పూజలు

మదనపల్లె అర్బన్, మార్చి 30: బసినికొండ పంచాయతీ కనుమలో వెలసిన కనుమలో గంగమ్మ జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈవో రమణ తెలిపారు. శనివారం రాత్రి తిరుణాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. గంగమ్మను ప్రత్యేకంగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. బసినికొండ, రామాచార్లపల్లె, నిమ్మనపల్లెరోడ్డు, డ్రైవర్స్ కాలనీ, మొలకలదిన్నె, వలసపల్లె, గ్రామాలకు చెందిన మహిళలు అమ్మవారికి దీటు,బోనాలను సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయకమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

గుర్రంకొండలో: తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలకడలో: మండలంలోని బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి విశేష పూజలను చేశారు. ఈ సందర్భంగా వేకువ జామునే స్వామి వారికి అభిషేకం, ఆకుపూజ కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

క్లస్టర్, బూత్ ఇన్‌చార్జుల కృషితోనే విజయం

- ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా
- మద్దతు ప్రకటించిన పలువర్గాల నేతలు
- ప్రచార రథాలు ప్రారంభం


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా

మదనపల్లె/టౌన్, మార్చి30:టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జుల కృషితోనే విజయం సాధ్యమని మదనపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడికూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం షాజహాన్‌బాషా నివాసం వద్ద క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులతో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 259 పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రతి బూత్, క్లస్టర్ ఇన్‌చార్జులు కో ఆర్డినేషన్ చేసుకుని చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అలాగే పోలింగ్ శాతం ఎక్కువ జరిగేలా కృషి చేయాలన్నారు. ఏప్రిల్ 14వ తేది వరకు 18 ఏళ్లు నిండిన యువత ఓటరు నమోదు చేసుకునే అవకాశం ఉందని, బీఎల్‌ఏలు ఆ దిశగా యువతకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీటీఎం క్రాస్ క్లస్టర్ ఇన్‌చార్జి చల్లా నరసింహులు, చల్లా శ్రీనివాసులు, కోనూరి వేమన్న, గౌర రఘుపతి, లలితమ్మ, మహబూబ్ బాషా, రాజన్న పాల్గొన్నారు.కాగా మదనపల్లె టీడీపీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషాకు వివిధ ప్రాంతాలకు చెందిన పలువురి నేతలు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఇందులోభాగంగా పట్టణంలోని అభ్యర్థి నివాసంలో శనివారం వేర్వేరుగా కలసి పార్టీలో చేరడంతోపాటు ఎన్నికల్లో మద్దతు తెలిపారు. మదనపల్లె, రామసముద్రం మండలాలకు చెందిన టీడీపీ, జనసేనతోపాటు వైసీపీ కార్యకర్తలు మద్దతు తెలుపు తున్నట్లు ప్రకటించారు. రామసముద్రం మండలం ఊలపాడు పంచాయతీ నరసాపురా నికి చెందిన వైసీపీ కార్యకర్తలు వెంకటప్ప, వైంకటరమణ, చిన్నరాజు,ఆర్.వెంకటరమణ, రమేష్, ఎల్లప్ప, శ్రీనివాసులు కలసి మద్దతు ప్రకటించారు. టీడీపీకి చెందిన మహేష్, శివ, మునిరాజు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. రామసముద్రం మండలం కమ్మవారిపల్లె పంచాయతీ టీడీపీ సీనియర్ నేతలు షాజహాన్‌బాషాను కలసి మద్దతు తెలిపారు. ఇందులో ఇంజం వెంకటరమణ నాయుడు, సర్పంచి చలపతినాయుడు, మాజీసర్పంచులు వెంకటప్ప, రామకృష్ణ, పూసల శంకర్, మద్దతు తెలిపిన వారిలో ఉన్నారు. మండలం లోని జనసేన నాయకులు షాజహాన్‌బాషాను కలసి సంపూర్ణ మద్దతు తెలిపారు. అలాగే మదనపల్లె మండలం సీటీఎంకు చెందిన నరసింహులు ఆధ్వర్యంలో కార్యకర్తలు పార్టీలో చేరడంతోపాటు ఎన్నికల్లో మద్దతు ప్రకటించారు.

మూడు ప్రచార రథాలు ప్రారంభం

సాధారణ ఎన్నికల్లో ఊరు, వాడ, గ్రామాల్లో ప్రచారం నిర్వహించడానికి టీడీపీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా మూడు ప్రచార రథాలను ప్రారంభించారు. నియోజకవర్గంలోని మదనపల్లె పట్టణం, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో వాటి ద్వారా ప్రచారం నిర్వహించనున్నారు. ఇందులో టీడీపీ నేత జునైద్‌అక్బరీ పాల్గొన్నారు.

రామసముద్రంలో: రామసముద్రం నుంచి పదివేల మెజార్టీతో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషాను గెలిపిస్తామని మండల జనసేన అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం మదనపల్లెలోని షాజహాన్‌ను కలిసి తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ షాజహాన్‌ను అసెంబ్లీకి పంపి చంద్రబాబునాయుడును టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా జనసేన నాయకులు సనాఉల్లా, మండల పార్టీ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, గడ్డం లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శి ఆంజప్ప, తదితరులు పాల్గొన్నారు.

కమ్మ సామాజిక వర్గం మద్దతు షాజహాన్‌బాషాకే..


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కమ్మ సామాజిక వర్గం నాయకులు

మదనపల్లెటౌన్, మార్చి30:మదనపల్లె నియోజకవర్గంలోని కమ్మసామాజిక వర్గం అంతా టీడీపీ అభ్యర్థి షాజహాన్ బాషాకే మద్దతు ఇస్తున్నామని కమ్మ సామాజిక వర్గం నాయకులు పేర్కొన్నారు. శనివా రం స్థానిక సుభాష్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయం వద్ద సమావేశమైన కమ్మ సామాజిక వర్గం విలేకర్ల సమావేశం నిర్వహించారు. మూడు రోజుల క్రితం మదనపల్లెలో జరిగిన చంద్రబాబు బహిరంగ సభపై కొంత మంది వైసీపీ నాయకులు కమ్మ సామాజిక వర్గం షాజహాన్‌బాషా వెంట లేదని అవాస్తవాలు ప్రచారం చేశారన్నారు. వాటిని నియోజకవర్గంలోని కమ్మ కులస్థులు అందరూ ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. వైసీపీ పాలనలో సీఎం జగన్ కమ్మకులస్థులనే లక్ష్యంగా చేసుకుని వేధించారన్నారు. జగన్ పాలనలోనే ఎక్కువగా కమ్మ కులస్థులు ఆర్థికంగా నష్టపోవడమే కాక, అక్రమ కేసులకు బాధితులయ్యామన్నారు. తామంతా షాజహాన్ బాషా వెంటే నడుస్తామని మద నపల్లెలో టీడీపీ అభ్యర్థిని గెలిపించి, రాష్ట్రానికి మళ్లీ చంద్రబాబును సీఎం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జే వెంకటేశ్, విద్యాసాగర్, రాటకొండ మధుబాబు, గుర్రప్పనాయుడు, గంగారపు గౌతమ్, శ్రీరామ రవికాంత్, ఇంజరపు వెంకటరమణ, మాకినేని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడుదాం

- తంబళ్లపల్లె నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి


కూటమి ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

ములకలచెరువు, మార్చి 30: రాష్ట్రంలో వైసీపీ అరాచక, అవినీతి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కదిరినాథునికోటలో శనివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగిస్తున్న వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఒక్కఛాన్సు పేరుతో అధికారంలో వచ్చిన జగన్ ప్రజలను నట్టేట ముంచాడన్నారు. కాగా స్వగ్రామానికి వచ్చిన జయచంద్రారెడ్డికి మహిళలు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, టీడీపీ నేతలు కేశవులు, కేవీ రమణ, నాయకులు నాగిరెడ్డి, ఫాస్టర్ శ్రీనివాసులు, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్ గ్యారంటీలు తీసుకెళ్లండి


జంగా గౌతమ్‌తో నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్

మదనపల్లె అర్బన్, మార్చి 30: గడప గడపకు కాంగ్రెస్ గ్యారంటీలు ఇంటింటా ప్రచారంలో ప్రజలకు తెలియజేయాలని రాయలసీ జిల్లాల కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగా గౌతమ్ పేర్కొన్నారు. శనివారం జంగా గౌతమ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమానికి మదనపల్లె నియో జకవర్గ నాయకుడు ఎస్ రెడ్డిసాహెబ్ పాల్గొని చేపట్టబోయే కార్యాచరణ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ గ్యారంటీలు రైతు రుణమాఫీ రూ.2 లక్షల వరకు, రైతుపెట్టుబడి మీద 50శాతం లాభంతో మద్దతు ధర, ప్రత్యేక హోదా 10 ఏళ్ల గ్యారంటీ, ఇల్లులేని వారికి 5లక్షలతో ఇళ్లు, ఉచితవిద్య కేజీ టు పీజీ వరకు, వృద్ధులకు, వితంతువులకు 4వేలు, వికలాంగులకు 6 వేలు పెన్షన్ , తొలి ఏడాదిలోనే 30 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించనున్నట్లు కాంగ్రెస్ అధిష్టానం ప్రకటిం చిందన్నారు. దీనిని అన్ని నియోజకవర్గాల్లో గ్రామస్థాయి నుంచి ప్రజలల్లో తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కాంగ్రెస్‌పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు.

ఏఐతో కంప్యూటర్ సైన్సు ముందంజ

మదనపల్లె టౌన్,మార్చి 30: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కంప్యూటర్ సైన్సు రంగం ముందంజలో ఉందని బెంగళూరుకు చెందిన కాగ్నిజెంట్ సంస్థ ప్రతినిధి సందీప్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నాలజి అండ్ అడాప్టబిలిటి అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ లర్నింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, రోబోటిక్స్, వర్చువల్ రియాలిటి లాంటి టెక్నాలజిలపై ఇంజినీరింగ్ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి, కంప్యూటర్ సైన్సు హెచ్‌వోడీ షఫి, విద్యార్థులు పాల్గొన్నారు.